RNI NO .TGTEL/25/A4366

బాల్యవివాహాల నిర్మూలనకు అందరూ సహకరించాలి




వరంగల్ ఎంపీ
డా.కడియం కావ్య

# తెలుగు గళం

సామాన్యుల గుండె చప్పుడు    జాతీయ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

E69 NEWS ,తెలుగు గళం దినపత్రికలో
పని చేయుటకు నియోజకవర్గాలవారీగా
విలేకరులు కావలెను వాట్సాప్ నెం:
9959812941-9949356387

PUBLISHED: TELANGANA    సంపుటి : 01    సంచిక :61    గురువారం 05 ఫిబ్రవరి 2026    ఎడిటర్: రాయపర్తి భాను ప్రసాద్    పేజీలు: 08    వెల :05/-

## అందంగా కనిపించవద్దని భార్యకు గుండు కొట్టిన భర్త



న్యూస్ డెస్క్ , 04 ఫిబ్రవరి (తెలుగు గళం న్యూస్): భార్య అందంగా ఉంటే ఎవరైనా సంతోషిస్తారు కానీ ఓ భర్తకు మాత్రం తన భార్య అందంగా ఉండటం తలనొప్పిని తీసుకువచ్చింది. అందరూ తన భార్యనే చూడటంతో తట్టుకోలేకపోయాడు. భార్య అందంగా ఉందని మురిసిపోవాలో పక్కవాళ్లు ఆమెనే చూస్తున్నారని బాధపడాలో అర్థం కాలేదు. దానికి తోడు అనుమానం కూడా మొదలైంది. ఈ క్రమంలోనే ఓ షాకింగ్ నిర్ణయం తీసుకున్నాడు. భార్యను ఎలాగైనా అందవిహీనంగా ఎవరి కన్ను పడకుండా చేయాలని అనుకున్నాడు. దాని కోసం ఆమెకు ఏకంగా గుండు గీసేశాడు. ఈ ఘటన కర్ణాటకలోని బాగల్ కోట జిల్లా తొదలబాగిలో చోటు చేసుకుంది. ఉమేశ్, లక్ష్మీ బాయి ఇద్దరూ భార్య భర్తలు.

అయితే భార్యకు పొడవాటి జడ ఉండటం వాటిని ఆమె అందంగా అలంకరించుకోవడం చూసి ఉమేశ్ ఓర్చుకోలేకపోయాడు. తన భార్య యువకులను ఆకట్టుకుంటోందని అనుమానంతో రగిలిపోయాడు. ఇది ఇలానే కొనసాగితే తన కొంప కొల్లేరు అవుతుందని అనుకున్నాడో ఏమో గానీ సోమవారం రాత్రి ఇంటికి ఫుల్లుగా తాగి వచ్చాడు. భార్యతో గొడవపడగా చివరకు చెరుకు నరికే రేజర్ కత్తితో ఆమెపై బెదిరింపులకు పాల్పడి గుండు చేశాడు. ఈ ఘటనపై స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేయగా ఉమేషన్ ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఇక ఈ ఘటన వైరల్ అవ్వడంతో అసలు అందమైన భార్యను ఎవరు చేసుకోమన్నారు.. చేసుకున్న తరవత అనుమానించమని ఎవరు చెప్పారు అంటూ నెటిజన్లు మండిపడుతున్నారు.

## ప్రజాస్వామ్య దేవాలయంలో ప్రతిపక్షాల గొంతు నొక్కేస్తున్నారు: ప్రియాంక గాంధీ





న్యూస్ డెస్క్ , 04 ఫిబ్రవరి (తెలుగు గళం న్యూస్): భారత్, అమెరికా ట్రేడ్ డీల్ పై పార్లమెంట్ లో తీవ్ర వివాదం నెలకొంది. అలాగే ఎల్ ఓపీ రాహుల్ గాంధీ దేశ సరిహద్దు భద్రతపై చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. ఈ క్రమంలో రాహుల్ గాంధీ మాట్లాడేందుకు స్పీకర్ నిరాకరించడంతో ఆగ్రహించిన కాంగ్రెస్ ఎంపీలో వెల్ లోకి దూసుకెళ్లి స్పీకర్ పోడియంపై నిలబడి పేపర్లు విసిరారు. దీంతో ఎనిమిది మంది ప్రతిపక్ష ఎంపీలపై సస్పెన్షన్ వేటు పడింది. దీనిపై బుధవారం ఉదయం కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా స్పందిస్తూ.. తీవ్రంగా ఖండించారు. అలాగే కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ఆమె "హాస్యాస్పదం" అని కొట్టిపారేస్తూ, ఇది దేశ ప్రజాస్వామ్యానికే గండమని మండిపడ్డారు.


### రన్‌వేపై ఢీకొన్న విమానాలు.. తప్పిన భారీ ప్రమాదం




### రికార్డులు సృష్టించిన యూపీఐ లావాదేవీలు




### హెలికాప్టర్ తయారీలోకి అదానీ గ్రూప్




### మిర్చికి ఆల్‌టైమ్ రికార్డు




### మేడారం ఆదాయం రూ. 3.28 కోట్లు




### తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి పవన్ కల్యాణ్





### తెలుగు రాష్ట్రాల్లో భయపెడుతున్న హెచ్ఐవీ మరణాలు.. తెలంగాణను మించిన ఏపీ




# పురపోరులో ఆ ప్రాంతమే కీలకం

## కాంగ్రెస్‌కు కొత్త టెన్షన్




న్యూస్ డెస్క్ (తెలుగుగళం న్యూస్)

- పురపోరు పంచాయితీ.. కాంగ్రెస్‌కు తొలి అసలైన పరీక్ష
- 100 మున్సిపాల్టీలు, 7 కార్పోరేషన్లు లక్ష్యం.. హస్తం భారీ ప్లాన్
- లోక్‌సభ నియోజవర్గానికి ఒక్క మంత్రి.. సీఎం రేవంత్ మాస్టర్ స్ట్రాటజీ
- ఉత్తర తెలంగాణలో కమలం దూకుడు.. నిజామాబాద్, కరీంనగర్ టార్గెట్
- బీఆర్ఎస్ కొత్త గేమ్‌ప్లాన్.. సీట్లకంటే ఓటింగ్ శాతం ఫోకస్
- ప్రచార రంగంలో దిగిన జాతీయ నేతలు.. తెలంగాణ హీట్ అప్
- కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ త్రికోణ పోరు.. అర్బన్ బాడీల్లో హైటెన్షన్
- మున్సిపల్ ఎన్నికలు = రాజకీయ శక్తి పరీక్ష.. ఎవరిది పైచేయి?

మిగతాది 2 లో

మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల విత్ డ్రా పర్వం ముగియడంతో ప్రధాన పార్టీలు గెలుపుపై ఫోకస్ పెట్టాయి. 100కు పైగా మున్సిపాల్టీలు, 7 కార్పోరేషన్లను కైవసం చేసుకోవాలని కాంగ్రెస్ టార్గెట్ పెట్టుకున్నది.అందుకోసం మంత్రులకు ఎన్నికల స్ట్రాటజీపై సీఎం రేవంత్ రెడ్డి దిశానిర్దేశం చేశారు. ఉత్తర తెలంగాణ లో బలంగా ఉన్న బీజేపీ పార్టీ ఈసారి నిజామాబాద్,కరీంనగర్ కార్పోరేషన్ల తో పాటు 10 మున్సిపాల్టీలో విజయం సాధించాలని ప్లాన్ చేస్తున్నది. అయితే రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న బీఆర్ఎస్ తమ ఉనికిని చాటుకునేందుకు మున్సిపాల్టీలకంటే ఓటు శాతంపై ఫోకస్ పెట్టింది.

## చిన్నారి నోటిలో పేలిన చాక్లెట్.. చీలిపోయిన దవడ, పెదాలు




న్యూస్ డెస్క్ , 04 ఫిబ్రవరి (తెలుగు గళం న్యూస్): చిన్నపిల్లలకు చాక్లెట్లు, బిస్కెట్లు అంటే ఎంతో ఇష్టం. అడిగింది కొనిచ్చే వరకూ మారాం చేస్తారు. అలా మూడేళ్ల కూతురు చాక్లెట్ అడిగితే ఓ షాపుకు తీసుకెళ్లి కొనిచ్చింది తల్లి. దానిని తీసి నోటిలో పెట్టుకుని కొరికే సరికి చిన్నారి నోటిలోనే చాక్లెట్ పేలింది. దీంతో బాలిక దవడ చీలిపోయింది.

## భారత్ సిటీలో విషాదం.. కొరియన్ లవ్ గేమ్‌కు బానిసలై ముగ్గురు బాలికలు సూసైడ్




న్యూస్ డెస్క్ , 04 ఫిబ్రవరి (తెలుగు గళం న్యూస్): ఆన్ లైన్ గేమ్స్ కు బానిసలై ముగ్గురు బాలికలు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ విషాద ఘటన ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని ఘజియాబాద్ లో జరిగింది. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మైనర్ అక్కాచెల్లెళ్లు.. ఒకరి చేయి ఒకరు పట్టుకుని ఓ భవనం 9వ అంతస్తు బాల్కనీ నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నారు. బుధవారం తెల్లవారుజామున ఈ హృదయ విదారక ఘటన జరిగింది.

## నామినేషన్లను ఉపసంహరించుకున్న 6701 మంది

### ఎన్నికల బరిలో 12,993 మంది అభ్యర్థులు




న్యూస్ డెస్క్ , 04 ఫిబ్రవరి (తెలుగు గళం న్యూస్): మున్సిపల్ ఎన్నికల్లో కీలక ఘట్టం ముగిసింది. ఈ ఎన్నికల 2,996 వార్డులకు గాను 20,313 మంది నామినేషన్లు దాఖలు చేస్తే పరిశీలన తర్వాత 19,694 నామినేషన్లకు చేరింది. అయితే వీరిలో 6701 మంది అభ్యర్థులను తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. దీంతో బరిలో 12,993 మంది అభ్యర్థులు ఉన్నట్టు ఎన్నికల అధికారులు ప్రకటించారు. దీంతోపాటు ఇండిపెండెంట్ అభ్యర్థులకు ఎన్నికల అధికారులు గుర్తులను సైతం కేటాయించారు. ఎన్నికల ప్రక్రియలో 25 శాతం పని పూర్తయిందని అధికారులు చెబుతున్నారు. ఇక ఎన్నికల నిర్వహణలో కీలక అంశమైన పోలింగ్ పై అధికారులు ఫోకస్ పెట్టారు. పోలింగ్ శాతాన్ని పెంచడానికి అధికారులు కసరత్తు చేస్తున్నారు. పోలింగ్ కు అవసరమైన సిబ్బంది, బ్యాలెట్ బాక్సుల కేటాయింపు, పోలీసు బందోబస్తు పై అధికారులు దృష్టి పెట్టారు.

52.43లక్షల ఓటర్లు.. రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీలు, ఏడు మున్సిపల్ కార్పొరేషన్లకు ఎన్నికలు జరుగుతున్నాయి. వీటిలో 2,996 వార్డులు ఉన్నాయి. మొత్తం 52.43లక్షల ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 25.62లక్షలు, మహిళలు 26.80లక్షలు, ఇతరులు 640 మంది ఓటర్లు ఉన్నారు. మహిళా ఓటర్లే అత్యధికంగా ఉన్నారు. వీరికి గాను 8,203 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి.

## ఆన్‌లైన్ మ్యాట్రిమోనియల్ ప్లాట్ ఫామ్స్ సైబర్ నేరగాళ్లకు అడ్డాగా మారుతున్నాయి: సుప్రీంకోర్టు




న్యూస్ డెస్క్ , 04 ఫిబ్రవరి (తెలుగు గళం న్యూస్): ఇటీవల ఆన్‌లైన్ మ్యాట్రిమోనియల్ అయిన Shaadi.com వేదికగా వరుసగా జరుగుతున్న సైబర్ నేరాలు, మోసాలపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఆన్‌లైన్ మ్యాట్రిమోనియల్ ప్లాట్‌ఫామ్ లు సైబర్ నేరగాళ్లకు అడ్డాగా మారుతున్నాయని ఈ కేసు విచారణ సందర్భంగా కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. వివరాల్లోకి వెళితే.. కొద్ది రోజుల క్రితం షాదీ డాట్ కామ్ వేదికగా జరిగిన ఒక భారీ మోసం కేసులో.. ఆ సంస్థ ఫౌండర్ అనుపమ్ మిట్టల్‌పై ఎఫ్ఐఆర్ నమోదైంది. ఆ నేపథ్యంలో వారు సుప్రీం కోర్టును ఆశ్రయించగా.. అత్యున్నత న్యాయస్థానం క్షుణ్ణంగా పరిశీలించింది. మ్యాట్రిమోనియల్ సైట్లు వినియోగదారుల వివరాలను సరిగ్గా వెరిఫై చేయకపోవడం వల్ల సైబర్ నేరగాళ్లకు మార్గం సులువుగా మారుతోందని న్యాయమూర్తులు అభిప్రాయపడ్డారు.

ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు: కొద్ది రోజుల క్రితం రాజమహేంద్రవరానికి చెందిన జోగాడ వంశీకృష్ణ అనే వ్యక్తి, షాదీ డాట్ కామ్ లో యానాం ఎమ్మెల్యే ఫోటోతో ఫేక్ ప్రొఫైల్ సృష్టించాడు. తనను తాను సంపన్న వ్యాపారవేత్తగా పరిచయం చేసుకుని, జూబ్లీహిల్స్‌కు చెందిన ఓ మహిళా డాక్టర్‌ని పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు.

# పురపోరులో ఆ ప్రాంతమే కీలకం.. కాంగ్రెస్‌కు కొత్త టెన్షన్

మొదటి పేజీ తరువాయి

కాంగ్రెస్ కు తొలి పరీక్ష..

అధికారంలోకి వచ్చిన తరువాత పార్టీ గుర్తులతో జరుగుతోన్న తొలి ఎన్నికలు కావడంతో కాంగ్రెస్ లీడర్లు చాలెంజ్ గా తీసుకుంటున్నారు. మెజార్టీ అర్బన్ బాడీల్లో విజయం సాధించాలని టార్గెట్ పెట్టుకున్నారు. లేకపోతే అటు పార్టీ, ఇటు ప్రభుత్వంపై పరువు పోతుందనే టెన్షన్ పట్టుకున్నది. అందుకే ఒక్కో లోకసభ నియోజవర్గానికి ఒక్కో మంత్రిని ఇన్ చార్జిగా నియమించారు. ఆ ఏరియాల్లోని మున్సిపాల్టీలు,కార్పోరేషన్లలో పార్టీ గెలుపుఓటముల బాధ్యతలను సదరు మంత్రులకు అప్పగించారు. ఎన్నికల్లో అనుచరించాల్సిన వ్యూహాలను సీఎం రేవంత్ రెడ్డి మంత్రులకు వివరిస్తూ, క్షేత్ర స్థాయిలో పార్టీకి సానుకూల వాతవరణం ఉందని పలు సర్వేల నివేధికలను మంత్రులకు అందించారు. అందుకని ఎన్నికలు ముగిసే వరకు సంబంధిత లోకసభ పరిధిలో ఉంటూ పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని సూచించార్ను. ప్రస్తుతం 116 మున్సిపాల్టీలు,7 కార్పోరేషన్లలో ఎన్నికలు జరుగుతున్నాయి. అందులో కనీసం 100 పైగా మున్సిపాల్టీల్లో చైర్మన్ పదవి దక్కించుకునేందుకు కావాల్సిన కార్పొరేటర్లను గెలిపించుకోవాలని టార్గెట్ పెట్టకున్నట్లు తెలిసింది. అలాగే ఎన్నికలు జరుగుతోన్న 7 కార్పోరేషన్లలో మేయర్ పదవిని కాంగ్రెస్ గెలుచుకునేందుకు లక్ష్యంగా పెట్టుకున్నారు.

నిజామాబాద్, కరీంనగర్ పై కమలం నజర్

ఉత్తర తెలంగాణలో బలంగా ఉన్న బీజేపీ పార్టీ ఆ ఏరియాలో మెజార్టీ మున్సిపాల్టీలను సొంతం చేసుకోవాలని టార్గెట్ పెట్టుకున్నది. ప్రధానంగా నిజామాబాద్,కరీంనగర్ మున్సిపల్ కార్పోరేషన్లు, 10 మున్సిపాల్టీలను కైవసం చేసుకునేందుకు ప్లాన్ చేస్తున్నది. అందుకోసం కేంద్రమంత్రి బండి సంజయ్ కొన్ని రోజులుగా కరీంనగర్ లో ఉంటూ అభ్యర్థుల ఎంపిక, ప్రచారం కొనసాగిస్తున్నారు. అలాగే నిజామాబాద్ ఎంపీ అర్వింద్ కుమార్ సైతం నిజామాబాద్ కార్పోరేషన్ లో విజయం సాధించేందుకు తీవ్రంగా కష్టపడుతున్నారు. మరోవైపు అదిలాబాద్ ఎంపీ నగేష్ సైతం నియోజకవర్గంలోఉంటూ గెలుపుకోసం ప్రయత్నాలు చేస్తున్నారు.

ఓటింగ్ శాతంపైనే బీఆర్ఎస్ ఫోకస్

మెజార్టీ మున్సిపాల్టీల్లో విజయం సాధిస్తామని బీఆర్ఎస్ నేతలు పైకీ చెప్తోన్న వాస్తవానికి మాత్రం 5నుంచి 10 మున్సిపాల్టీల్లో విజయం సాధించే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే సీట్ల కంటే ఓటింగ్ శాతం పెంచుకోవడంపై ఆ పార్టీ నేతలు ఫోకస్ పెట్టారు. దీనితో రాష్ట్రంలో తమే ప్రత్యామ్నయ పార్టీ అనే సందేశం ప్రజల్లోకి వెళ్తుందని అంచనా వేస్తున్నారు. అలాగే పార్టీ లీడర్లు,కేడర్ లో సైతం ఓరకమైన బూస్టింగ్ గా ఉంటుందని ఆశిస్తున్నారు. అయితే కేసీఆర్,కేటీఆర్,హరీశ్ రావు నియోజకవర్గాల్లోని అన్ని మున్సిపాల్టీల్లో విజయం సాధించడంపై గులాబీ పార్టీ ఫోకస్ పెట్టింది.

ప్రచారంలోకి రేవంత్, నబీన్

నేటి నుంచి వరసగా 6 రోజుల పాటు సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల ప్రచార సభలో పాల్గొననున్నారు. నేడు నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో జరిగే పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న తరువాత ఎన్నికల ప్రచార సభలో పాల్గొంటారు. 5న కరీంనగర్ జిల్లా చొప్పదండిలో, 6న నిజామాబాద్ జిల్లాలోని రూరల్ లో, 7న రంగారెడ్డి జిల్లాలోని పరిగిలో, 8న భూపాలపల్లిలో, 9న మెదక్ లో ఎన్నికల సభల్లో పాల్గొననున్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలోకి కేంద్ర బీజేపీ నాయకత్వం రంగంలోకి దిగింది. మహబూబ్ నగర్ లో జరిగే ప్రచార సభలో ఆ పార్టీ జాతీయఅధ్యక్షుడు నితిన్ నబీన్ అటెంట్ అయ్యారు. అలాగే ఈనెల 8న అదిలాబాద్ లో జరిగే పబ్లిక్ మీటింగ్ కు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా హాజరుకానున్నారు. బీఆర్ఎస్ పార్టీ లీడర్లు కేటీఆర్,హరీశ్ రావు అవసరం ఉన్న మున్సిపాల్టీలతో పాటు తమ సొంత నియోజకవర్గాల్లోని మున్సిపాల్టీల్లో ఎన్నికల ప్రచారంచేయాలని భావిస్తున్నారు.

## రికార్డులు సృష్టించిన యూపీఐ లావాదేవీలు

న్యూస్ డెస్క్ , 04 ఫిబ్రవరి (తెలుగు గళం న్యూస్): దేశంలో డిజిటల్ చెల్లింపులు అత్యంత వేగంగా ఊహించని స్థాయిలో పెరుగుతున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి డిసెంబర్ వరకు యూపీఐ ద్వారా జరిగే లావాదేవీలు రికార్డు స్థాయిలో రూ. 230 లక్షల కోట్లకు చేరాయని ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరీ తెలిపారు. మంగళవారం రాజ్యసభలో ప్రశ్నోత్తరాల సందర్భంగా ఓ ప్రశ్నకు సమాధానమిచ్చిన ఆయన.. యూపీఐ ఆధారిత లావాదేవీల విలువ చాలా వేగంగా విస్తరిస్తున్నాయి. దేశీయ లావాదేవీల విషయానికొస్తే, 2025-26 సంవత్సరంలో డిసెంబర్ వరకు మొత్తం రూ. 230 లక్షల కోట్ల విలువైన లావాదేవీలు జరిగాయి. ఇది 2022-23లో జరిగిన మొత్తం రూ. 139 లక్షల కోట్ల లావాదేవీల విలువతో పోలిస్తే చాలా ఎక్కువని అన్నారు. యూపీఐ ఇప్పుడు భారత్‌కు వెలుపల కూడా విస్తరిస్తోందని, స్థానిక చట్టాలను అనుసరిస్తూనే ఎనిమిది దేశాలలో దీన్ని ఉపయోగిస్తున్నారు. మరో ప్రశ్నకు లిఖితపూర్వక స్మాధానమిచ్చిన ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్.. యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) అంతర్జాతీయ విస్తరణ కోసం ప్రభుత్వం, భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ), ఎన్‌పీసీఐ ఇంటర్నేషనల్ పేమెంట్స్ లిమిటెడ్ (ఎన్ఐపీఎల్) వివిధ చర్యలు తీసుకుంటున్నాయన్నారు. వాటిలో ఇతర దేశాల్లో పర్సన్ టూ పర్సన్ (పీ2పీ) చెల్లింపులను సులభతరం చేయడానికి భాగస్వామ్య దేశాలలోని ఫాస్ట్ పేమెంట్ సిస్టమ్‌లతో యూపీఐ అనుసంధానం అయ్యే ప్రయత్నం చేస్తోంది. అలాగే పర్సన్ టూ మర్చంట్ (పీ2ఎం) చెల్లింపులను ప్రారంభించడానికి ప్రయాణ ఆధారిత కారిడార్లను ఏర్పాటు చేయడం వంటివి ఉన్నాయని పేర్కొన్నారు.

## హెలికాప్టర్ తయారీలోకి అదానీ గ్రూప్

న్యూస్ డెస్క్ , 04 ఫిబ్రవరి (తెలుగు గళం న్యూస్): దేశీయ బిలియనీర్ గౌతమ్ అదానీకి చెందిన అదానీ గ్రూప్ కొత్తగా హెలికాప్టర్ల తయారీలోకి అడుగుపెడుతున్నట్టు ప్రకటించింది. దేశంలో ఇంటిగ్రేటెడ్ హెలికాప్టర్ తయారీ ఎకోసిస్టమ్‌ను ఏర్పాటు చేయడానికి అదానీ గ్రూప్‌నకు చెందిన అదానీ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్, ఇటాలియన్ దిగ్గజం లియోనార్డో మంగళవారం వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కుదుర్చుకున్నట్టు వెల్లడించాయి. ఈ మేరకు ఇరు సంస్థలు మంగళవారం భాగస్వామ్య ఒప్పందంపై సంతకాలు చేశాయి. ఇటీవలే అదానీ గ్రూప్ విమానాల తయారీ కోసం బ్రెజిల్‌కు చెందిన ఎంబ్రేయర్ కంపెనీతో జతకట్టిన సంగతి తెలిసిందే. 'మేక్ ఇన్ ఇండియా' ప్రయత్నాలకు, దేశాన్ని మరింత స్వయం సమృద్ధిగా మార్చడానికి ఈ ఒప్పందం సహకరిస్తుంది. ఈ భాగస్వామ్యం భారత సాయుధ దళాల అవసరాలను, ముఖ్యంగా లియోనార్డో అధునాతన ఏడబ్ల్యూ169ఎం, ఏడబ్ల్యూ109 ట్రెక్కర్‌ఎమ్ హెలికాప్టర్లను దేశీయంగా తయారు చేసేందుకు దోహదపడుతుంది. అంతేకాకుండా దశల వారీగా స్థానిక తయారీ మాత్రమే కాకుండా నిర్వహణ, రిపేర్లు, మెయింటెనెన్స్, ఓవర్‌హాలింగ్ సామర్థ్యం, పైలట్ల ట్రెయినింగ్ లాంటి ఈ ఒప్పందంలో భాగంగా జరుగుతాయని అదానీ గ్రూప్ వెల్లడించింది. ప్రస్తుతం దేశంలో హెలికాప్టర్ల వినియోగం చాలా తక్కువగా ఉంది. దేశవ్యాప్తంగా 250 కంటే తక్కువ హెలికాప్టర్లు ఉండటంతో ఈ రంగంలో వృద్ధికి అవకాశాలు మెండుగా ఉన్నాయని అదానీ డిఫెన్స్, ఏరోస్పేస్ సీఈఓ ఆశీష్ రాజ్‌వంశీ చెప్పారు. రాబోయే పదేళ్లలో ఏడాదికి 100 హెలికాప్టర్ల అవసరం ఉంటుందని ఆయన అంచనా వేశారు.

## ప్రజాస్వామ్య దేవాలయంలో ప్రతిపక్షాల గొంతు నొక్కేస్తున్నారు: ప్రియాంక గాంధీ


మొదటి పేజీ తరువాయి

ప్రజాస్వామ్య హననం

ఎంపీల సస్పెన్షన్ పై ప్రియాంక గాంధీ మీడియాతో మాట్లాడుతూ.. పార్లమెంట్‌ను ప్రజాస్వామ్య దేవాలయంగా అభివర్ణించి.. ప్రతి సభ్యుడికి తమ అభిప్రాయాలను వినిపించే హక్కు ఉంటుందని, కానీ ప్రభుత్వం ప్రతిపక్షాల గొంతు నొక్కేస్తోందని ఆరోపించారు. మాజీ సైన్యాధిపతి జనరల్ ఎం.ఎం. నరవాణే రాసిన అముద్రిత జ్ఞాపకాల్లోని అంశాలను రాహుల్ గాంధీ ప్రస్తావించకుండా అడ్డుకోవడంపై ఆమె స్పందించారు. చైనా చొరబాట్ల సమయంలో ప్రధాని, హోం మంత్రి, రక్షణ మంత్రుల స్పందన ఎలా ఉందో ఆ పుస్తకంలోని అంశాలు బయటపెడతాయన్న భయంతోనే ప్రభుత్వం ఇలా వ్యవహరిస్తోందని విమర్శించారు. అలాగే లైంగిక నేరస్థుడైన జెఫ్రీ ఎప్స్టీన్ ఫైల్స్‌లో ప్రభుత్వ సంబంధాల గురించి సమాచారం ఉందని, అథెంటికేటెడ్ డాక్యుమెంట్లను కూడా సభలో చర్చించనివ్వకపోవడం ఏంటని ఆమె ప్రశ్నించారు.

రాహుల్ గాంధీకి మద్దతు: రాహుల్ గాంధీ ఇప్పటికే పబ్లిష్ అయిన మేగజైన్ కథనాల ఆధారంగానే మాట్లాడుతున్నారని, ఆయన వద్ద ఉన్న సమాచారాన్ని ధృవీకరించడానికి సిద్ధంగా ఉన్నా ప్రభుత్వం ఎందుకు భయపడుతోందని ఆమె నిలదీశారు. ఇదిలా ఉంటే నిన్న స్పీకర్ పోడియం వద్ద హంగామా సృష్టించినందుకు కాంగ్రెస్ నుంచి మాణిక్యం ఠాగూర్, హిబీ ఈడెన్, అమరీందర్ సింగ్ రాజా వారింగ్, గురుజీత్ సింగ్ ఔజ్లా, ప్రశాంత్ పాడోలే, చామల కిరణ్ కుమార్ రెడ్డి, డీన్ కురియకోస్, సిపిఎం నుండి ఎస్. వెంకటేషన్‌లను మిగిలిన బడ్జెట్ సమావేశాల మొత్తానికి సస్పెండ్ చేశారు.

## మిర్చికి ఆల్‌టైమ్ రికార్డు



న్యూస్ డెస్క్ , 04 ఫిబ్రవరి (తెలుగు గళం న్యూస్): వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో మిర్చికి ఆల్‌టైమ్ రికార్డు ధర నమోదైంది. వండర్ హాట్ మిర్చి ధర క్వింటాల్‌కు రూ.37,100గా రికార్డు స్థాయిలో పలికింది. బుధవారం రైతులు మార్కెట్‌కు తీసుకువచ్చిన మిర్చికి ఈ ధర వచ్చింది. గత నెల రోజులుగా రైతులు తీసుకువస్తున్న మిర్చికి ధరలు క్రమంగా పెరుగుతున్నాయి. తేజ మిర్చి క్వింటాల్‌కు రూ.19,000 నుంచి రూ.20,000 వరకు పలుకుతోంది. వండర్ హాట్ మిర్చి ధర క్వింటాల్‌కు రూ.30,000 నుంచి రూ.37,000 వరకు ఉంది. దేశీ రకం మిర్చికి క్వింటాల్‌కు రూ.35,000 నుంచి రూ.41,000 వరకు ధర లభిస్తోంది. ఈ ఏడాది మిర్చి విస్తీర్ణం తగ్గడం వల్ల ధరలు పెరుగుతున్నాయని వ్యాపారులు తెలిపారు. గడిచిన కొన్ని రోజులుగా మిర్చికి ధరలు పెరుగుతున్నాయని మార్కెట్ కార్యదర్శి మల్లేశం తెలిపారు.

## ఆన్‌లైన్ మ్యాట్రిమోనియల్ ప్లాట్ ఫామ్స్ సైబర్ నేరగాళ్లకు అడ్డాగా మారుతున్నాయి: సుప్రీంకోర్టు

మొదటి పేజీ తరువాయి

అనంతరం అతనిపై ఆమెకు పూర్తి నమ్మకం వచ్చిన తర్వాత అసలు గేమ్ మొదలు పెట్టాడు. తన ఆస్తులకు సంబంధించిన డాక్యుమెంట్లు, బ్యాంక్ అకౌంట్లు ప్రస్తుతం జప్తులో ఉన్నాయని నమ్మించి మహిళా డాక్టర్ వద్ద రూ. 11 లక్షలు వసూలు చేశాడు. కొద్ది రోజుల తర్వాత మహిళా డాక్టర్ తన డబ్బులు తిరిగి అడగ్గా.. ఆమెను బెదిరించాడు. ఫోటోలు మార్ఫింగ్ చేసి.. సోషల్ మీడియాలో పెడతానని దబాయించాడు. దీంతో ఆమె మోసపోయినట్టు గుర్తించి పోలీసులను ఆశ్రయించగా నిందితుడి అసలు రంగు బయపడింది. అనంతరం కేసు నమోదు చేసిన పోలీసులు వ్యవహారంలో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు గాను నిందితుడితో పాటు షాదీ డాట్ కామ్ యాజమాన్యం పై కూడా పోలీసులు కేసు నమోదు చేశారు.

హైకోర్టుకు సుప్రీంకోర్టు ఆదేశం: ఫ్రాడ్ కేసులో నిందితుడితో పాటు షాదీ డాట్ కామ్ యజమానిపై కేసు నమోదైంది. దీంతో తనపై ఉన్న ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని అనుపమ్ మిట్టల్ తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. అతని పిటీషన్‌ను తెలంగాణ హైకోర్టు తిరస్కరించింది. అయితే, దీనిపై పునఃసమీక్ష జరపాలని, అంశాల వారీగా స్వతంత్ర నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు తెలంగాణ హైకోర్టును ఆదేశించింది. అలాగే అనుపమ్ మిట్టల్‌పై రాబోయే ఎనిమిది వారాల పాటు ఎటువంటి కఠిన చర్యలు (అరెస్ట్ వంటివి) తీసుకోకూడదని ధర్మాసనం మధ్యంతర రక్షణ కల్పించింది.

దీంతో పాటుగా.. ఇంటర్మీడియరీ సంస్థలు తమ ప్లాట్‌ఫారమ్‌లపై జరిగే నేరాలను అడ్డుకోవడంలో మరింత బాధ్యతాయుతంగా ఉండాలని కోర్టు సూచించింది. ఈ కేసులో సుప్రీం తీర్పుతో మ్యాట్రిమోనియల్ సైట్స్ వెరిఫికేషన్ ప్రక్రియలపై తీవ్రమైన చర్చ మొదలైంది. ఇకపై ఇటువంటి సంస్థలు తమ వినియోగదారుల భద్రత విషయంలో మరింత కఠినమైన నిబంధనలు పాటించాల్సిన అవసరం ఉందని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.


## మేడారం ఆదాయం రూ. 3.28 కోట్లు

న్యూస్ డెస్క్ , 04 ఫిబ్రవరి (తెలుగు గళం న్యూస్): మేడారం జాతర నేపథ్యంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలోని ఖమ్మం, సత్తుపల్లి, కొత్తగూడెం, మణుగూరు, భద్రాచలం డిపోల నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులను నడిపించింది. జాతర సందర్భంగా ఆర్టీసీకి వచ్చిన ఆదాయ వివరాలను అధికారులు అధికారికంగా వెల్లడించారు. ఖమ్మం డిపో నుంచి 41 బస్సులతో 318 ట్రిప్పులు నిర్వహించగా రూ. 60,66,398 ఆదాయం లభించింది. సత్తుపల్లి డిపో నుంచి 26 బస్సులు ఏర్పాటు చేసి 749 ట్రిప్పులు నడిపించగా రూ. 74,44,937 ఆదాయం వచ్చింది. భద్రాచలం డిపో నుంచి 36 బస్సులు, కొత్తగూడెం డిపో నుంచి 90 బస్సులు, మణుగూరు డిపో నుంచి 21 బస్సు సర్వీసులు కలిపి మొత్తం 147 సర్వీసులు నడిపారు. ఈ మూడు డిపోల ద్వారా మొత్తం 1,172 ట్రిప్పులు నిర్వహించారు. ఇందులో భద్రాచలం డిపోకు రూ. 46,91,726, కొత్తగూడెం డిపోకు రూ. 1,07,02,941, మణుగూరు డిపోకు రూ. 39,33,179 ఆదాయం సమకూరింది. మొత్తంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఐదు డిపోల నుంచి 214 ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేయగా, 2,040 ట్రిప్పులకు గాను రూ. 3,28,39,181 ఆదాయం వచ్చినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. జాతర సందర్భంగా ప్రత్యేక సర్వీసులు నడిపి సంస్థకు గణనీయమైన ఆదాయం చేకూర్చడంలో సహకరించిన ఆర్టీసీ అధికారులు, డ్రైవర్లు, కండక్టర్లు, ఇతర సిబ్బందికి అధికారులు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి పవన్ కల్యాణ్

న్యూస్ డెస్క్ , 04 ఫిబ్రవరి (తెలుగు గళం న్యూస్): తెలంగాణలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీకి జనసేన పార్టీ మద్దతు ప్రకటించింది. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ తరఫున ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రచారం చేయనున్నారు. ఈ విషయాన్ని జనసేన పార్టీ ఒక ప్రకటన ద్వారా తెలియజేసింది.ఈ నెల 7, 8వ తేదీల్లో తెలంగాణ రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి, పవన్ కల్యాణ్ ప్రచారం చేయనున్నారు. దీనికి సంబంధించి ప్రచార షెడ్యూల్ రూట్‌మ్యాప్‌ను తొందరలోనే ప్రకటిస్తామని జనసేన పార్టీ తెలిపింది. కాగా, ఈ మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేయాలని జనసేన పార్టీ ముందుగా భావించింది. కానీ ఏపీలో బీజేపీతో ఉన్న పొత్తు కారణంగా ఆ ఆలోచనను విరమించుకుంది. ఈ క్రమంలోనే తెలంగాణలో బీజేపీని బలపరుస్తూ ప్రచారం చేయాలని పవన్ కల్యాణ్ భావిస్తున్నారు.

## తెలుగు రాష్ట్రాల్లో భయపెడుతున్న హెచ్‌ఐవీ మరణాలు




న్యూస్ డెస్క్ , 04 ఫిబ్రవరి (తెలుగు గళం న్యూస్): తెలుగు రాష్ట్రాల్లో హెచ్‌ఐవీ ముప్పు మరోసారి ఆందోళన కలిగిస్తోంది. గడిచిన ఐదేళ్ల ఈ వైరస్ బారిన పడి మృత్యువాత పడిన వారి సంఖ్య టెన్షన్ పెట్టిస్తోంది. ఈ విషయంలో తాజాగా కేంద్రం వెల్లడించిన గణాంకాలు షాక్‌కు గురి చేస్తున్నాయి. 2020-2024 మధ్య ఐదేళ్లలో రెండు తెలుగు రాష్ట్రాల్లో 44,140 మంది హెచ్‌ఐవీ బాధితులు మరణించారని కేంద్ర మంత్రి అనుప్రియ పటేల్ తాజాగా రాజ్యసభలో సభ్యుడు అడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. ఇందులో ఏపీలో 32,642 మంది, తెలంగాణలో 11,498 మంది ఉన్నారని పేర్కొన్నారు. ఇదే కాలంలో దేశవ్యాప్తంగా 1.81 లక్షల మంది హెచ్‌ఐవీ బాధితులు మరణించారని తెలిపారు.

ఆ రంగంంలో వైరస్ వ్యాప్తి: ఇదిలా ఉంటే దేశవ్యాప్తంగా ఐటీ రంగంలో హెచ్‌ఐవీ వైరస్ విస్తృతంగా వ్యాపిస్తున్నట్లు జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ (న్యాకో) గతేడాది హెచ్చరించింది. ఐటీ రంగంలో విదేశీ తరహా ఆధునిక జీవన శైలికి అలవాటు పడటం హెచ్‌ఐవీ వ్యాప్తి పెరగడానికి కారణం అవుతోందని అన్ని రాష్ట్రాల ఎయిడ్స్ నియంత్రణ సొసైటీలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. అలాగే ఈ రంగానికి సంబంధించి హెచ్‌ఐవీ పరీక్షల సంఖ్యను పెంచాలని తెలిపింది. ఇక తెలంగాణలో హెచ్‌ఐవీ సంక్రమణ రేటు క్రమంగా తగ్గుతోందని గతంలో తెలంగణ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ వెల్లడించింది. 2024 లో హెచ్‌ఐవీ సంక్రమణ రేటు 0.44 ఉంటే అది కాస్త 2025 నాటికి 0.41 కు తగ్గిందని పేర్కొంది.

## చిన్నారి నోటిలో పేలిన చాక్లెట్.. చీలిపోయిన దవడ, పెదాలు

మొదటి పేజీ తరువాయి

తీవ్రంగా గాయపడిన కూతురిని వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లగా.. వైద్యులు చీలిన దవడకు చికిత్స చేసి, కుట్లు వేశారు. ప్రస్తుతం బాలిక కోలుకుంటోందని వైద్యులు తెలిపారు. రాజస్థాన్లోని అల్వార్ రోడ్డులో చౌకి బాస్ గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది.

చిన్నారి తల్లి తెలిపిన వివరాల ప్రకారం.. తన కూతురు అక్షు (3)కు ఊర్లోనే ఉన్న కిరాణా కొట్టులో చాక్లెట్ కొనిచ్చింది. ఎంతో ఇష్టంగా దానిని నోటిలో పెట్టుకోగా అది పేలిపోయింది. దీంతో పెదాలు, దవడలు చీలిపోయాయి. వెంటనే అల్వార్లో ఉన్న ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. వైద్యులు ట్రీట్మెంట్ చేశారు. ప్రస్తుతం బాలిక ఐసీయూలో చికిత్స పొందుతున్నట్లు రామ్ గఢ్ ఎస్ హెచ్ఓ విజయేంద్ర సింగ్ తెలిపారు. ఈ ఘటనపై చిన్నారి అత్త నికిత పోలీసులకు ఫిర్యాదు చేసింది. సుదీల్ అలియాస్ కలా.. అక్షుకి గన్ పౌడర్ ఉన్న ఫైర్ క్రాకర్ చాక్లెట్ ఇవ్వడంతో ఆమె తీవ్రంగా గాయపడిందని, దీనివల్ల అక్షు ఎంతో బాధపడుతోందని ఫిర్యాదులో పేర్కొంది. ఆ సమయంలో తనకూతురు అహానా కూడా అక్కడికి కూల్ డ్రింక్ తాగేందుకు వెళ్లగా.. చాక్లెట్ పేలడంతో కూల్ డ్రింక్ బాటిల్ కూడా పగిలిందని పోలీసులకు తెలిపింది. పోలీసులు కేసు నమోదు చేసి సుదీల్ ను అరెస్ట్ చేశారు. ఫోరెన్సిక్ పరీక్షల నివేదిక వచ్చాక చర్యలు చేపడుతామని, అన్ని కోణాల్లోనూ దర్యాప్తు చేస్తున్నామని డీఎస్పీ పింటూ కుమార్ తెలిపారు.

## భారత్ సిటీలో విషాదం.. కొరియన్ లవ్ గేమ్‌కు బానిసలై ముగ్గురు బాలికలు సూసైడ్

మొదటి పేజీ తరువాయి

ముగ్గురు బాలికలు ఆన్ లైన్ గేమ్ కు బానిసలైన క్రమంలో.. అవన్నీ మానుకోవాలని కుటుంబ సభ్యులు హెచ్చరించడంతో వారంతా ఈ కఠిన నిర్ణయం తీసుకున్నారు.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఘజియాబాద్ లోని భారత్ సిటీ రెసిడెన్షియల్ టౌన్ షిప్ లో బుధవారం తెల్లవారుజామున సుమారు 2 గంటల సమయంలో ఈ ఘటన జరిగింది. అందరూ నిద్రిస్తుండగా.. భవనం పైనుంచి ఏదో పడిన శబ్దం వినిపించడంతో.. స్థానికులు ఉలిక్కిపడ్డారు. ఏం జరిగిందోనని చూడగా.. పాఖీ (12), ప్రాచి (14), విశికా (16) విగతజీవులుగా కనిపించారు. వెంటనే పోలీసులకు సమాచారమివ్వగా మృతదేహాలను పోస్టుమార్టంకు తరలించారు. కుటుంబ సభ్యులను ప్రాథమిక విచారణ చేయగా వారి సూసైడ్స్ కు అసలు కారణం తెలిసింది.

వాస్తవానికి దూరంగా.. వర్చువల్ ప్రపంచంలోనే

ప్రాథమిక విచారణలో.. కరోనా లాక్‌డౌన్ సమయంలో ప్రారంభమైన ఆన్‌లైన్ గేమింగ్‌పై ఈ ముగ్గురు అక్కాచెల్లెళ్లకు తీవ్ర ఆసక్తి ఏర్పడినట్లు పోలీసులు తెలిపారు. ముఖ్యంగా 'కొరియన్ లవ్ గేమ్' అనే ఆన్‌లైన్ టాస్క్ ఆధారిత గేమ్‌కు వారు బాగా అలవాటు పడ్డారని వెల్లడించారు. ఈ గేమ్‌పై ఇంట్లో తరచూ వివాదాలు జరుగుతుండేవని పోలీసులు తెలిపారు. గేమ్‌లలో మునిగిపోయిన కారణంగా స్కూల్‌కు కూడా వెళ్లడం మానేశారని చెప్పారు. వర్చువల్ ప్రపంచంలోనే ఎక్కువ సమయం గడుపుతూ వాస్తవ జీవితానికి దూరమయ్యారని అధికారులు పేర్కొన్నారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను తెలుసుకునేందుకు విచారణ కొనసాగుతోంది.

'కొరియన్ లవ్ గేమ్' అంటే ఏమిటి?

'కొరియన్ లవ్ గేమ్' అనేది ఒక రకమైన ఆన్‌లైన్ చాట్ గేమ్. ఇందులో అవతలి వ్యక్తి తాను కొరియా లేదా విదేశానికి చెందిన యువకుడు/యువతిగా పరిచయం చేసుకుంటూ మాట్లాడటం మొదలుపెడతాడు. ఈ గేమ్ ప్రధానంగా సోషల్ మీడియా, మెసేజింగ్ యాప్‌ల ద్వారా వ్యాప్తి చెందుతుంది.

మొదట స్నేహం, ప్రేమ పేరుతో మాటలు మొదలవుతాయి. నమ్మకం పెంచేందుకు సులభమైన పనులను అప్పగిస్తారు. ఆ తర్వాత క్రమంగా క్లిష్టమైన పనులను చేయమంటారు. మానసిక ఒత్తిడి పెంచుతూ బెదిరింపులకు కూడా దిగుతారు. చెప్పినట్లు చేయకపోతే ఇబ్బందులు పెడతామని హెచ్చరిస్తారు. దీని వల్ల బాధితులు తీవ్ర ఒత్తిడికి గురవుతారని, ఫలితంగా వారి ప్రవర్తనలో మార్పులు వస్తాయని నిపుణులు చెబుతున్నారు.

## నామినేషన్లను ఉపసంహరించుకున్న 6701 మంది.. ఎన్నికల బరిలో 12,993 మంది అభ్యర్థులు

మొదటి పేజీ తరువాయి

50శాతం మహిళలకే..

రాష్ట్రంలోని ఏడు మున్సిపల్ కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీల్లోని 2,996 వార్డుల్లో కేటగిరీల వారీగా కేటాయించారు. బీసీ జనరల్ 463, బీసీ మహిళా 391, ఎస్సీ జనరల్ 254, ఎస్సీ మహిళా 190, ఎస్టీ జనరల్ 147, ఎస్టీ మహిళా 40 వార్డులు కేటాయించారు. వీరితో రిజర్వుకానివి 647, రిజర్వ్ కానివి(మహిళ) 864 వార్డులు ఉన్నాయి. వీటిలో మహిళలకు 50 శాతం అంటే 1,485 వార్డులను కేటాయించారు.

90 వేల మంది సిబ్బంది..

మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సుమారు 90 వేల మంది సిబ్బంది అవసరముంటుందని అధికారులు అంచనా వేశారు. వీరిలో పోలీసులే 25 వేల మంది ఉన్నారు. అడిషనల్ ప్రిసైడింగ్ ఆఫీసర్లు 31,428మంది ఉన్నారు. రిటర్నింగ్ ఆఫీసర్లు 1,379మంది, అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్లు 1,547 మంది ఉన్నారు. వీరితోపాటు జోనల్ ఆఫీసర్లు 742 ఉన్నారు. ఎఫ్ ఎస్టీ టీమ్స్ 279, ఎస్ఎస్టీ టీమ్స్ 381 లలో కనీసం ముగ్గురు సిబ్బంది ఉండే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

బ్యాలెట్ బాక్సులు 16,031..

ఈ ఎన్నికల్లో 2,996వార్డులకు పోటిచేసే అభ్యర్థుల 15 వేలకు పైగా ఉండే అవకాశాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. ఒక్క వార్డులో అభ్యర్థులతో పాటు నోటా కూడా ఉంటుంది. అందులో భాగంగానే ఈ ఎన్నికల్లో 16,031 బ్యాలెట్ బాక్సులను వినియోగించాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది. వీటికోసం 137 స్ట్రాంగ్ రూమ్స్ ఏర్పాటు చేశారు. పోలింగ్ తర్వాత కౌంటింగ్ కోసం ఏర్పాటు చేసిన 136 కేంద్రాల్లోకి బ్యాలెట్ బాక్సులను పంపించనున్నారు.

## రన్‌వేపై ఢీకొన్న విమానాలు.. తప్పిన భారీ ప్రమాదం

న్యూస్ డెస్క్ , 04 ఫిబ్రవరి (తెలుగు గళం న్యూస్): ముంబయిలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఒక పెను ప్రమాదం తృటిలో తప్పింది. రన్‌వేపై ఎయిరిండియా విమానం, ఇండిగో విమానం రెక్కలు, అవి ముందుకు కదులుతున్న సమయంలో ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఈ ఘటన జరిగిన సమయంలో రెండు విమానాల్లోనూ ప్రయాణికులు ఉన్నారు. ఒక్కసారిగా రెక్కలు ఢీకొనడంతో విమానాశ్రయంలో కలకలం రేగింది. అయితే అదృష్టవశాత్తూ ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదు. దీంతో ప్రయాణికులు, సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటన రన్‌వేపై ట్యాక్సింగ్ జరుగుతున్న సమయంలో చోటు చేసుకుందని అధికారులు తెలిపారు. అంటే విమానాలు గాల్లోకి ఎగరలేదు, దిగలేదు. కేవలం రన్‌వేపై ముందుకు కదులుతున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. వెంటనే ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ అధికారులు స్పందించి, రెండు విమానాలను ఆపేశారు. ప్రయాణికులను సురక్షితంగా విమానాల నుంచి దింపి, ఇతర ఏర్పాట్లు చేశారు. విమానాలకు స్వల్ప నష్టం జరిగినట్లు సమాచారం. ఈ ఘటన వల్ల కొంతసేపు విమానాశ్రయంలో విమానాల రాకపోకలు నిలిపివేశారు. ఈ ఘటనపై డీజీసీఏ మరియు విమానాశ్రయ అధికారులు విచారణ ప్రారంభించారు. ఇది మానవ తప్పిదమా? లేక ఎయిర్ ట్రాఫిక్ నియంత్రణలో లోపమా? అన్న కోణాల్లో దర్యాప్తు జరుగుతోంది. దేశంలోని అత్యంత రద్దీగా ఉండే విమానాశ్రయాల్లో ముంబయి ఒకటి కావడంతో, ఇలాంటి ఘటన జరగడం ఆందోళన కలిగిస్తోంది. విమానాలు టేకాఫ్ లేదా ల్యాండింగ్ లో ఉన్నప్పుడు జరిగి ఉంటే ఘోర ప్రమాదం జరిగి ఉండేదని ప్రయాణికులు వణికిపోయారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా మరింత కఠినమైన భద్రతా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని విమానయాన నిపుణులు హెచ్చరిస్తున్నారు. కాగా ఇటీవల మహారాష్ట్రలో జరిగిన ఓ ప్రయివేట్ విమాన ప్రమాదంలో ఆ రాష్ట్ర డిప్యూటీ సీఎం శరద్ పవార్ మృతి చెందిన సంగతి తెలిసిందే. అలాగే గతేడాది గుజరాత్ లోని అహ్మదాబాద్ లో జరిగిన ఎయిర్ ఇండియా ఘోర విమాన ప్రమాదంలో 241 మంది మరణించారు.

# కరీంనగర్ 52వ డివిజన్‌లో జాగృతి అభ్యర్థికి మద్దతుగా భారీగా చేరికలు



తెలుగు గళం న్యూస్ కరీం నగర్: కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 52వ డివిజన్ నుంచి తెలంగాణ జాగృతి – ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ కార్పొరేటర్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఉప్పరి సంగీతకు మద్దతుగా 50 మంది కార్యకర్తలు జాగృతిలో చేరారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు గుంజపడుగు హరిప్రసాద్ కండువా కప్పి వారిని ఆహ్వానించారు.ఈ సందర్భంగా గుంజపడుగు హరిప్రసాద్ మాట్లాడుతూ కరీంనగర్ స్మార్ట్ సిటీ పేరుతో భారీ అవినీతి జరిగిందని ఆరోపించారు. నగరంలో మూడు ప్రధాన రాజకీయ పార్టీల కుమ్మక్కు రాజకీయాలు నడుస్తున్నాయని, నగర పాలక సంస్థకు వచ్చిన నిధులను దారి మళ్లించి బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ నాయకులు వందల కోట్ల రూపాయల అవినీతికి పాల్పడ్డారని విమర్శించారు. ఈ అంశంపై ఏ పార్టీ నాయకుడు కూడా మాట్లాడడం లేదని ప్రశ్నించారు.ప్రశ్నించే గొంతుకగా కవితక్క నాయకత్వంలో సామాజిక తెలంగాణ లక్ష్యంగా, కరీంనగర్ అభివృద్ధి కోసం తెలంగాణ జాగృతి మరియు ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థులు సింహం గుర్తుతో ఎన్నికల బరిలో నిలిచారని తెలిపారు.కరీంనగర్ ప్రజలు సింహం గుర్తుకు ఓటు వేసి అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కవితక్క నాయకత్వంలో జాగృతి ద్వారా కరీంనగర్ అభివృద్ధికి అడుగులు వేయాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ నాయకుడు చంటి శ్రీనివాస్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు అక్కం శివారణి, ఆదివాసి విభాగం జిల్లా అధ్యక్షుడు కుతాడి శ్రీనివాస్ పాల్గొన్నారు.జాగృతిలో చేరిన వారిలో లంక భవాని, లంక మనోజ్, ఉప్పరి మనీత్, ఎస్.కే. బషీరా, రామగిరి అనవ్వ, అస్తపురం అంజలి, తాళ్ల హారిక, బుర్ర రాజు, గసికంటి సాయి వంశి, బొడ్డు పెల్లి సాయి, కుమ్మరి సాయి కృష్ణ, పందురాల రాజు, మైసాని యశ్వంత్, కుక్క రవి, బత్తుల వివేక్, మంథని ప్రసాద్, ఎండీ షరీఫ్, కౌరు కోటి తదితరులు ఉన్నారు.

# స్టేషన్ ఘనపూర్ రెండో వార్డులో రెబల్ అభ్యర్థిగా గుర్రం శ్రీను ప్రచారం జోరు



తెలుగు గళం న్యూస్ స్టేషన్ ఘనపూర్ ఫిబ్రవరి 04: జనగామ జిల్లా స్టేషన్ ఘన్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని రెండో వార్డులో రెబల్ అభ్యర్థిగా గుర్రం శ్రీను ఎన్నికల బరిలో నిలిచారు.ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన వార్డులోని ప్రతి ఇంటిని వ్యక్తిగతంగా సందర్శిస్తూ ఓటర్లతో మమేకమవుతున్నారు.తనకు కేటాయించిన బ్యాట్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ప్రజలను అభ్యర్థిస్తూ, వార్డు అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఎన్నో సంవత్సరాలుగా పరిష్కారం కాని డ్రైనేజీ, రోడ్లు, తాగునీరు, వీధి దీపాలు వంటి మౌలిక సమస్యలు వార్డులో ఉన్నాయని, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తాను బాగా తెలుసునని చెప్పారు.తాను గెలిస్తే వార్డులో పెండింగ్‌లో ఉన్న సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని, ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడిగా పనిచేస్తానని హామీ ఇచ్చారు.బిఆర్ఎస్ పార్టీలో దీర్ఘకాలంగా పనిచేసినా తనకు టికెట్ ఇవ్వకపోవడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. పార్టీ బలోపేతానికి ఎన్నో కార్యక్రమాల్లో పాల్గొని కష్టపడ్డానని, కార్యకర్తలతో కలిసి పనిచేశానని గుర్తుచేశారు.అయినప్పటికీ తన సేవలను గుర్తించకపోవడం బాధాకరమని, అందుకే ప్రజల మద్దతుతో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని గుర్రం శ్రీను తెలిపారు. వార్డు ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, వారి ఆశయాలను నెరవేర్చేందుకు తాను కట్టుబడి ఉంటానని అన్నారు.

# చాగల్లు 9వ వార్డు నుంచి ఇండిపెండెంట్‌గా యాదగిరి బరిలో



తెలుగు గళం న్యూస్ స్టేషన్ ఘనపూర్ ఫిబ్రవరి 4: స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన చాగల్లు 9వ వార్డు నుంచి ఇండిపెండెంట్ అభ్యర్థిగా యాదగిరి ఎన్నికల బరిలో నిలిచారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వార్డులో తాగునీరు, కాలువలు, రహదారులు, పారిశుధ్యం వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తానన్నారు. ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండి సమస్యలను వెంటనే పరిష్కరించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.పార్టీలకు అతీతంగా వార్డు సమగ్ర అభివృద్ధే తన లక్ష్యమని, యువతకు ఉపాధి అవకాశాలు, మహిళలకు సంక్షేమ కార్యక్రమాలు తీసుకురావడానికి కట్టుబడి ఉంటానన్నారు. ప్రజల ఆశీస్సులు, సహకారంతో చాగల్లు 9వ వార్డును ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దుతానని తెలిపారు.వార్డు ప్రజలు తనకు మద్దతు ఇచ్చి ఆపిల్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని యాదగిరి కోరారు.

# 8వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థిగా చాతరబోయిన సత్యనారాయణ

## సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు




తెలుగు గళం న్యూస్ స్టేషన్ ఘనపూర్ ఫిబ్రవరి 04: జనగామ జిల్లా స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ పరిధిలోని చాగల్లు 8వ వార్డు నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా చాతరబోయిన సత్యనారాయణ ఎన్నికల బరిలో నిలిచారు.అభ్యర్థిత్వం ఖరారైన సందర్భంగా ఆయన వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ ఓటర్లను కలిసి మద్దతు కోరుతున్నారు.ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుంటూ, పరిష్కారానికి కట్టుబడి ఉంటానని భరోసా ఇస్తున్నారు.వార్డులో నెలకొన్న రోడ్ల దుస్థితి, డ్రైనేజీ సమస్యలు, తాగునీటి ఇబ్బందులు, వీధి దీపాల కొరత వంటి మౌలిక సమస్యలను ప్రాధాన్యంగా తీసుకుని దశలవారీగా పరిష్కరిస్తానన్నారు.ఓటర్లు తనను ఆశీర్వదించి గెలిపిస్తే ఎంపీ డా. కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి సహకారంతో ప్రత్యేక నిధులు తీసుకువచ్చి వార్డును ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు.ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండే ప్రజా ప్రతినిధిగా సేవ చేయడం తన లక్ష్యమని, అభివృద్ధి మరియు పారదర్శక పరిపాలనకు కట్టుబడి ఉంటానని తెలిపారు.కాంగ్రెస్ పార్టీ సంక్షేమ విధానాలను ప్రజలకు చేరవేసి ప్రతి కుటుంబానికి లాభం చేకూరేలా కృషి చేస్తానన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చి భారీ మెజారిటీతో గెలిపించాలని వార్డు ప్రజలను కోరారు.ఈ ప్రచార కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ స్థానిక నాయకులు, కార్యకర్తలు, యువత, మహిళలు మరియు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని అభ్యర్థికి మద్దతు తెలిపారు.

# కొడుకుల వేధింపులతో వృద్ధ మహిళ ఆవేదన

## హెచ్ఆర్ఏజే హ్యూమన్ రైట్స్‌ను ఆశ్రయించిన కమల



తెలుగు గళం న్యూస్ హన్మకొండ ఫిబ్రవరి 04: హనుమకొండ జిల్లా భీమావరం గ్రామానికి చెందిన గాజుల కమల అనే వృద్ధ మహిళ తన స్వంత కొడుకుల వేధింపుల నుంచి రక్షణ కల్పించాలని హెచ్ఆర్ఏజే హ్యూమన్ రైట్స్ సంస్థను ఆశ్రయించింది. ప్రభుత్వ ఉద్యోగిగా పని చేసి రిటైర్ అయిన తన భర్త ఆరోగ్య కారణాలతో మృతి చెందగా, ప్రస్తుతం వచ్చే పెన్షన్‌తోనే జీవనం సాగిస్తున్నట్లు కమల తెలిపింది.గత రెండు సంవత్సరాలుగా తన చిన్న కొడుకు విజయ్, చిన్న కోడలు కీర్తన శారీరకంగా, మానసికంగా హింసిస్తూ అమానుషంగా ప్రవర్తిస్తున్నారని ఆమె ఆరోపించింది. తన దగ్గర ఇంటి కిరాయి పేరుతో రూ.6 లక్షలు వసూలు చేసి, బంగారం తీసుకుని, ఇంకా కోటి రూపాయలు కావాలంటూ తరచూ కొడుతూ చిత్రహింసలకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసింది.గతంలో కేయూ క్రాస్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ, మారుతామని నమ్మబలికి ఇంటికి తీసుకెళ్లి, గత ఆరు నెలలుగా ఇంట్లోనే నిర్బంధించి వేధిస్తున్నారని తెలిపింది. ఎవరితోనూ మాట్లాడనివ్వకుండా, ఫోన్ కూడా పగలగొట్టారని కన్నీటి పర్యంతమైంది.తన చిన్న కొడుకు వల్ల ప్రాణాపాయం ఉందని భయాందోళన వ్యక్తం చేసిన కమల, అధికారులే జోక్యం చేసుకుని తనకు న్యాయం చేయాలని హెచ్ఆర్ఏజే హ్యూమన్ రైట్స్ ద్వారా విజ్ఞప్తి చేసింది.




# ఫిష్ మార్కెట్ పనులను త్వరగా ప్రారంభించాలి

## సిపిఎం రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ జాన్ వెస్లీ



తెలుగు గళం న్యూస్ స్టేషన్ ఘనపూర్: స్టేషన్ ఘన్పూర్ మండల కేంద్రం పల్లగుట్ట క్రాస్ రోడ్డులో మత్స్యకారుల కోసం సుమారు నాలుగేళ్ల క్రితం శంకుస్థాపన చేసిన ఫిష్ మార్కెట్ నిర్మాణాన్ని మధ్యలోనే వదిలేశారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ జాన్ వెస్లీ విమర్శించారు.హన్మకొండలో ఓ కార్యక్రమానికి హాజరై హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణంలో భాగంగా పల్లగుట్ట క్రాస్ రోడ్డులో ఆగి, మత్స్య కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మునిగేల రమేష్‌తో కలిసి మత్స్యకారుల సమస్యలను తెలుసుకున్నారు.ఫిష్ మార్కెట్ లేక హైవే రోడ్డుపై చేపలు అమ్మాల్సి రావడంతో ప్రమాదాలు జరిగే అవకాశముందని, వెంటనే మార్కెట్ పనులను పునఃప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు.చేపలకు మద్దతు ధర ప్రకటించాలని, మార్కెట్ నిర్మాణం పూర్తిచేయడంలో స్థానిక ఎమ్మెల్యే చొరవ తీసుకోవాలని కోరారు.ఘన్‌పూర్ రిజర్వాయర్ వద్ద చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం ఏర్పాటు చేయడానికి అవకాశం ఉందని, దాన్ని త్వరగా ప్రారంభించాలని సూచించారు.గ్రామాల్లో మత్స్యకారుల జీవన స్థితి అట్టడుగు స్థాయిలో ఉందని, వారికి బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయించాలని, మహిళా సొసైటీలకు ఒక్కొక్కటికి రూ.20 లక్షల రుణ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చేపల వేట, విక్రయాల సమయంలో ప్రమాదాలకు గురై మృతి చెందిన వారికి రాష్ట్ర ప్రభుత్వం రూ.10 లక్షలు, కేంద్ర ప్రభుత్వం రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా, ఇన్సూరెన్స్ ప్రకటించాలని కోరారు. 50 సంవత్సరాలు దాటిన మత్స్యకారులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.అనంతరం మత్స్యకారులు జాన్ వెస్లీకి చేపను అందజేశారు. ఈ కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం.వి. రమణ, జీఎంపీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఉడత రవీందర్ తదితరులు పాల్గొన్నారు.మత్స్యకారులు శాగ రాజు, గోనెల ఉమ, గోనెల స్వప్న, రమ, బూర్ల ఊర్మిళ తదితరులు హాజరయ్యారు.

# తెలంగాణ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం జనగామ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా కీర్తి రమేష్, బానోతు రవీందర్ ఎన్నిక





తెలుగు గళం న్యూస్ జనగామ: జనగామ జిల్లా కేంద్రంలోని ధర్మకంచ జిల్లా పరిషత్ పాఠశాలలో బుధవారం రోజు తెలంగాణ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా ఎన్నికలు నిర్వహించారు. ఈ కార్యక్రమం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కె. మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది.జరిగిన ఎన్నికల్లో హన్మంతాపూర్ ప్రధానోపాధ్యాయులు కీర్తి రమేష్‌ను జిల్లా అధ్యక్షుడిగా, జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు బానోతు రవీందర్‌ను జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నారు.కోశాధికారిగా నిమ్మ వాసుదేవరెడ్డి, ఉపాధ్యక్షులుగా ఎల్లంబట్ల విజయకుమార్, మొరే కనకయ్య, కార్యదర్శులుగా వెంకటేశ్వర్లు, హరిశంకర్‌లను ఎంపిక చేశారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన నాయకులు మాట్లాడుతూ పర్యవేక్షణ వ్యవస్థను పటిష్టం చేసి డీఈవో, ఎంఈవో పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని, ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని, మధ్యాహ్న భోజన పథకాన్ని అక్షయపాత్ర ఫౌండేషన్‌కు అప్పగించి ప్రధానోపాధ్యాయులపై ఒత్తిడి తగ్గించాలని డిమాండ్ చేశారు.

# బాల్యవివాహాల నిర్మూలనకు అందరూ సహకరించాలి

## వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య





తెలుగు గళం న్యూస్ హన్మకొండ ఫిబ్రవరి 04: బాల్యవివాహాలను అరికట్టేందుకు సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకొని కృషి చేయాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య పిలుపునిచ్చారు.హనుమకొండ జిల్లా కనకదుర్గ కాలనీలో మహిళా శిశు సంక్షేమ శాఖ, షేర్ ఎన్‌జీవో సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన ప్రచార రథాన్ని ఎంపీ డా.కడియం కావ్య జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎంపీ డా.కడియం కావ్య మాట్లాడుతూ..బాల్యం అమూల్యమైన దశ అని పేర్కొన్నారు.బాల్యవివాహాలు పిల్లల చదువు, ఆరోగ్యం, శారీరక–మానసిక అభివృద్ధిపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతాయని అన్నారు. చదువు మధ్యలో ఆగిపోవడం వల్ల జీవితాంతం ఎన్నో సమస్యలను ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు.బాల్యవివాహాలను పూర్తిగా నిర్మూలించేందుకు ప్రభుత్వం పలు కార్యక్రమాలు అమలు చేస్తోందని, బాలికల విద్యను ప్రోత్సహిస్తూ ఉచిత విద్యను అందుబాటులోకి తీసుకొచ్చిందని గుర్తు చేశారు. బాల్యవివాహాలు లేని రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దేందుకు ప్రజలందరూ సహకరించాలని కోరారు.పిల్లలు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత విద్యావంతులుగా ఎదగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో షేర్ ఎన్‌జీవో డైరెక్టర్ గోపాల్ రెడ్డి, కోఆర్డినేటర్ సిరీష, వరంగల్ సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ వాసుధ, సభ్యురాలు మధు,



హనుమకొండ సీడబ్ల్యూసీ సభ్యుడు సుధాకర్, శ్రీకాంత్ రెడ్డి, కమ్యూనిటీ మొబిలైజర్లు జ్ఞానేశ్వరి, జగన్, చామంతి, జమున, ప్రశాంతి, కల్పన, ప్రభాకర్, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక వ్యతిరేక చట్టాల రద్దు కోసం సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలి

## ఫిబ్రవరి 12 జాతీయ సమ్మెను జయప్రదం చేయండి

## సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కాసు మాధవి



తెలుగు గళం న్యూస్ జఫర్గఢ్: జనగామ జిల్లా జఫర్గఢ్ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ, నాలుగు లేబర్ కోడ్ల రద్దు కోసం సమరశీల పోరాటాలకు కార్మిక వర్గం సిద్ధం కావాలని, ఈనెల 12న జరిగే జాతీయ సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కాసు మాధవి పిలుపునిచ్చారు.మండల కేంద్రంలో కాట సుధాకర్ అధ్యక్షతన సిఐటియు సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన కాసు మాధవి, సిఐటియు జిల్లా అధ్యక్షులు రాపర్తి రాజు మాట్లాడుతూ..స్వాతంత్ర్యానికి పూర్వమే కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్లను పెట్టుబడిదారీ కార్పొరేట్ యాజమాన్యాలకు అనుకూలంగా తీసుకువచ్చారని విమర్శించారు.బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాల ఫలితంగా కోట్లాది కార్మికులకు ఉద్యోగ భద్రత కరువైందని, అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని మండిపడ్డారు. కార్మికుల కనీస వేతనం నెలకు రూ.26,000 అమలు చేయకపోవడం వల్ల చాలి చాలని వేతనాలతో శ్రమదోపిడీ జరుగుతోందని అన్నారు.అసంఘటిత రంగంలోని అంగన్వాడీ, భవన నిర్మాణ, రవాణా తదితర రంగాల కార్మికులకు సామాజిక భద్రత కల్పించాలని, వివిధ రంగాల కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 12న జరిగే జాతీయ కార్మిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో సిఐటియు మండల కన్వీనర్ గుండెబోయిన రాజు పాల్గొన్నారు.అనంతరం సిఐటియు జఫర్గఢ్ మండల కేంద్ర నూతన గ్రామ సమన్వయ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కన్వీనర్గా కాట సుధాకర్ ఎన్నిక కాగా, సభ్యులుగా కుల్ల సురేందర్, కుల్ల రామచంద్రు, బంగారు చిరంజీవి, తాటికాయల కుమార్, యాతం సోమయ్య, సాకి నరసింగం, చెన్నబోయిన సోమశేఖర్, చిలువేరు నాగరాజు, యల్మకంటి సుధాకర్, నల్ల తీగల శ్రీను, ఎండి అలీమ్, తాటికాయల రేణుక, చిర్ర కుమార్ ఎన్నికయ్యారు.

# అవినీతిరహిత పాలనకై యువతను ఆదరించాలి

## జనసేన పార్టీ ఇంచార్జ్ గాదె పృథ్వీ



తెలుగు గళం న్యూస్ స్టేషన్ ఘనపూర్,ఫిబ్రవరి 04: స్టేషన్ ఘనపూర్ మున్సిపల్ ఎన్నికల్లో యువతను ప్రోత్సహించి ఆదరించాలని జనసేన పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ గాదె పృథ్వీ పిలుపునిచ్చారు.అవినీతిరహిత పాలన సాధించాలంటే జనసేన అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు.మున్సిపాలిటీలో పోటీ చేస్తున్న పార్టీ అభ్యర్థులకు మద్దతుగా నిర్వహించిన బైక్ ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. అనంతరం పోటీ చేస్తున్న వార్డుల్లో జనసైనికులతో కలిసి ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు. జీరో బడ్జెట్ పాలిటిక్స్ విధానంతో యువత రాజకీయాల్లో కీలక పాత్ర పోషించాలని సూచించారు.జనసేన అధినేత పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో బరిలో ఉన్న 16వ, 18వ వార్డు అభ్యర్థులను గెలిపించాలని కోరారు.రాజకీయ ప్రక్షాళన యువతతోనే సాధ్యమని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా నాయకులు డా. గోళ్ళ రాజేంద్ర ప్రసాద్, గడ్డం రాకేష్, శేషాద్రి సందీప్, మెడిద ప్రశాంత్, కొల్లూరి అనుదీప్, అభిలాష్, మహమ్మద్ రజాక్, మహమ్మద్ ఫరీద్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య విస్తృత ప్రచారం






తెలుగు గళం న్యూస్ స్టేషన్ ఘనపూర్ ఫిబ్రవరి 04: స్టేషన్ ఘనపూర్ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య పాల్గొన్నారు. ఘనపూర్ మున్సిపాలిటీ శివునిపల్లి పరిధిలోని 2, 3, 4, 5 వార్డుల్లో ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు.మహిళలు, వృద్ధులు, చిన్నారులను ఆప్యాయంగా పలకరిస్తూ స్థానికులతో మమేకమై వారి సమస్యలను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీ డా. కడియం కావ్య మాట్లాడుతూ, స్టేషన్ ఘనపూర్ సమగ్ర అభివృద్దే తమ కుటుంబ లక్ష్యమని తెలిపారు.మున్సిపాలిటీలో ఓటు అడిగే నైతిక హక్కు ఎమ్మెల్యే కడియం శ్రీహరికే ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే మున్సిపాలిటీకి నిజమైన అభివృద్ధి సాధ్యమని, ఇతర పార్టీలు గెలిస్తే నిధులు స్వప్రయోజనాలకు దారి మళ్లే ప్రమాదం ఉందని విమర్శించారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే కడియం శ్రీహరి నాయకత్వంలో నియోజకవర్గంలో సాగునీరు, త్రాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం, విద్య, వైద్య రంగాల్లో గణనీయమైన అభివృద్ధి జరిగిందన్నారు. ఘనపూర్ మున్సిపాలిటీకి ఇప్పటికే రూ.50 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. అదనంగా తన ఎంపీ నిధుల నుంచి రూ.3.5 కోట్లను మంజూరు చేసి కమ్యూనిటీ హాళ్లు, రోడ్లు, వీధి దీపాల పనులు చేపట్టినట్లు వెల్లడించారు.దేవాదుల ఎత్తిపోతల పథకం ద్వారా రూ.400 కోట్లతో చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందిస్తున్నట్లు చెప్పారు.స్టేషన్ ఘనపూర్లో 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి 95 శాతం పనులు పూర్తి చేశామని, మరో దఫా ఇళ్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు.కేంద్ర నిధుల కోసం పార్లమెంటులో నిరంతరం పోరాటం చేస్తున్నానని, కడియం కుటుంబం స్వలాభం కోసం కాదు ప్రజల కోసం పనిచేస్తుందని స్పష్టం చేశారు.ఫిబ్రవరి 11న జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను



కోరారు. కాంగ్రెస్ అభ్యర్థులు గెలిస్తే మరో రూ.50 కోట్లతో మున్సిపాలిటీని మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. చిల్పూర్ బుగులు వెంకటేశ్వర స్వామి సాక్షిగా ప్రజా సంక్షేమమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో 2వ వార్డు అభ్యర్థి గుర్రం హరినాథ్, 3వ వార్డు అభ్యర్థి గుర్రం హైమా, 4వ వార్డు అభ్యర్థి బూర్ల శంకర్, 5వ వార్డు అభ్యర్థి కొంతం రజితతో పాటు కాంగ్రెస్ నాయకులు,బెల్ది వెంకన్న కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ జనగామ జిల్లా కన్వీనర్ పదవికి ఈగం శ్రీనివాస్ రాజీనామా






తెలుగు గళం న్యూస్ జనగామ ఫిబ్రవరి 04: ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ జనగామ జిల్లా కన్వీనర్ పదవికి ఈగం శ్రీనివాస్ బుధవారం రాజీనామా చేశారు. పార్టీ వ్యవహారాల పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఈగం శ్రీనివాస్ మాట్లాడుతూ, తనకు అధికారికంగా కేటాయించిన బి-ఫారంను అనూహ్యంగా రద్దు చేసి, అలవెన్స్ పేరుతో జాగృతి నాయకులకు అప్పగించడం ద్వారా తనను మోసం చేశారని ఆరోపించారు. ఈ విషయమై పార్టీ ఉన్నత నాయకత్వాన్ని పలుమార్లు సంప్రదించినప్పటికీ సరైన స్పందన రాలేదని, పార్టీలో సమన్వయ లోపం స్పష్టంగా కనిపించిందని అన్నారు.పార్టీ పట్ల నమ్మకంతో పనిచేసిన తనకు ఈ విధమైన అన్యాయం జరగడం బాధాకరమని, ఈ పరిణామాల కారణంగా తీవ్ర మనస్తాపానికి గురై రాజీనామా చేయాల్సి వచ్చిందని వెల్లడించారు.ఇకపై తన రాజకీయ భవిష్యత్తుపై త్వరలోనే నిర్ణయం ప్రకటిస్తానని ఈగం శ్రీనివాస్ తెలిపారు.

# ప్రచార హోరు 14 వ వార్డులో కాంగ్రెస్ జోరు



తెలుగు గళం న్యూస్ మహబూబాబాద్ జిల్లా: ఈరోజు మరిపెడ మున్సిపాలిటీ 14వ వార్డులో జాటోత్ సురేష్ తల్లిదండ్రుల, తల్లి ఆశీర్వాదం తీసుకొని పెద్ద సంఖ్యలో మహిళలతో,పార్టీ శ్రేణులతో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా వార్డు ప్రజలను చేతి గుర్తుపై అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని కోరారు.వార్డు అభివృద్ధికై నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.వార్డు ప్రజల కోసం పాలకునిగా కాకుండా సేవకునిగా పనిచేస్తానని వార్డు ప్రజలకు హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న అభివృద్ధికి మద్దతుగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలో ఉంది అని పేద బడుగు బలహీన వర్గాలకు సమూచిత న్యాయం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు,14 వ వార్డు ఓటర్లు అందరు కలిసి నన్ను భారీ మెజార్టీతో గెలిపించగలరని, స్థానిక ఎమ్మెల్యే జాటోత్ రామచంద్రనాయక్ ఆశీస్సులతో 14 వ వార్డుని అభివృద్ధి పథంలో తీసుకుపోతానని మాటిచ్చారు, 14 వార్డు ఓటర్ల ను చేతి గుర్తుపై ఓటు వేసి గెలిపించగలరని కోరారు. ఈ కార్యక్రమం లో మహిళ నాయకులు రాధికా, యూత్ నాయకులు వెంకట సాయి,యాకయ్య,ముల్క అనివెష్,శ్రీను,రాజ్దీప్,వినోద,శాంతమ్మ,ఇద్దమ్మ,జ్యోతి, ఉపేంద్ర,సింధు,బిందు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తుమ్మల వారసుడి జన్మదిన వేడుకలు"



సత్తుపల్లి,ఆర్ సి,ఫిబ్రవరి04(తెలుగుగళం)న్యూస్: బుదవారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనయుడు డాక్టర్ తుమ్మల యుగేందర్ పుట్టినరోజు సందర్భంగా సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలోని వేంసూరు మండలశిలోనీ మర్లపాడు గ్రామ చౌరస్తాలో వేంసూరు మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు.ముందుగా కేక్ కటింగ్ చేశారు.అందరికీ మిఠాయిలు పంచారు.ఈ కార్యక్రమంలో: ఖమ్మంజిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు పుచ్చకాయల సోమిరెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు కాసర్ల చంద్రశేఖర్ రెడ్డి,వెల్ది జగన్మోహన్ రావు,గొర్ల సంజీవరెడ్డి,తుమ్మూరు రామిరెడ్డి, మర్లపాడు సర్పంచ్ కనమాల ఆంధ్రయ్య,ఎండి పైజుద్దీన్,బొమ్మగంటి వెంకటేశ్వరరావు,మేడా వెంకటేశ్వరరావు,భీమిరెడ్డి పావని శ్రీనివాసరెడ్డి,గరికపాటి శ్రీనివాసరావు,మందపాటి రాఘవరెడ్డి గన్నేని సురేష్,వెల్ది ప్రసాద్, పుచ్చకాయల సత్యనారాయణ,కంకటి రాములు,సాదు వెంకటేశ్వరరావు,మేడిది ఈశ్వరచారి,నున్నా రంగారావు,వంట్లా చంటి,శివ, పెద్ద పుల్లయ్య,మట్టా ప్రసాద్, బాబిరెడ్డి ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 8 వార్డులో కారు జోరు

## బీఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థి బానోత్ శిరీష నరేష్ నాయక్



తెలుగు గళం న్యూస్ మహబూబాబాద్ జిల్లా: మరిపెడ మున్సిపాలిటీ 8 వ వార్డులో బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి బానోత్ శిరీష నరేష్ నాయక్ ఎన్నికల ప్రచారం లో భాగంగా ఇంటి ఇంటికి తిరిగి కారు గుర్తుకే ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించలి అని నిర్వహించిన ప్రచారం లో ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ మోసాలను మున్సిపాలిటీ ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని తెలిపారు,గృహలక్ష్మీ లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వకుండా గంధగోళం చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారు అన్నారు, బీఆర్ఎస్ హయాంలో పట్టణం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు,గడిచిన రెండేళ్లలో పట్టణంలో ఏం అభివృద్ధి చేశారు ప్రజలకు తెలిపాలని ప్రశ్నిస్తున్నాను అన్నారు,బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో మంజూరైన నిధులు రద్దు చేసిన ఘనత ప్రస్తుత ఎమ్మెల్యేదన్నారు, బీఆర్ఎస్ పార్టీ వేసిన శిలాఫలకాలు ధ్వంసం చేశారన్నారు,వాటి స్థానంలో కొత్తవి పెట్టి మేమే చేశామని గప్పాలు కొడుతున్నారన్నారు,ఈ కార్యక్రమం లో వార్డ్ ఇంచార్జి కేసముద్రం మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ రాంపెల్లి రవి గౌడ్,నారాయణ,కిషన్, పార్టీ ముఖ్య నాయకులు, పార్టీ కార్యకర్తలు భారీ ఎత్తున పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్లతో పేదవారి సొంతింటి కల సాకారం

## సర్పంచ్ జున్ను కనకయ్య యాదవ్



తెలుగు గళం న్యూస్/ ఫిబ్రవరి 4: వరంగల్ జిల్లా:పర్వతగిరి మండలం,జమాల్పురం గ్రామంలో గోదారి శ్రీలత కు మంజూరైన ఇందిరమ్మ ఇల్లు గోడల వరకు పూర్తయ్యింది. ఈ మేరకు స్లాబ్ పోయుటకు మిల్లర్ వద్ద కొబ్బరికాయ కొట్టి, స్లాబ్ పనులను సర్పంచ్ జున్ను కనకయ్య యాదవ్ ప్రారంభించారు.ఈ సందర్భంగా కనకయ్య యాదవ్ మాట్లాడుతూ, పేదవారి స్వంతింటి కలను సాకారం చేయడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే నాగరాజు కంకనం కట్టుకున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే సొంతింటి కల నెరవేరుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారురాలు శ్రీలత,యాకయ్యలతో పాటు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# పాఠశాల విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, విమర్శనాత్మక ఆలోచన అత్యవసరం

## – అవగాహన సెమినార్







తెలుగు గళం న్యూస్ ధర్మసాగర్ ఫిబ్రవరి 04: బాయ్స్ ధర్మసాగర్ పాఠశాల ప్రాంగణంలో రెండు రోజుల పాటు నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ ఉపాధ్యాయుల సమావేశం సందర్భంగా "పాఠశాల విద్యార్థులకు శాస్త్రీయ దృక్పథం మరియు విమర్శనాత్మక ఆలోచన ఎందుకు అవసరం?" అనే అంశంపై ప్రత్యేక అవగాహన సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జన విజ్ఞాన వేదిక తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ శ్రీ కె.బి. ధర్మ ప్రకాశ్ ముఖ్య వక్తగా హాజరై ప్రసంగించారు. విద్యార్థుల్లో ప్రశ్నించే స్వభావం, తర్కబద్ధమైన ఆలోచన, సాక్ష్యాధారాలపై ఆధారపడి నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాన్ని పెంపొందించడమే ఆధునిక విద్య యొక్క ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. అంధవిశ్వాసాలు, అపోహలను దూరం చేయడంలో శాస్త్రీయ దృక్పథం కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు.

ప్రత్యేకంగా ఇంగ్లీష్ బోధనలో కూడా శాస్త్రీయ దృక్పథాన్ని అనుసంధానం చేస్తే, భాషా నైపుణ్యాలతో పాటు ఆలోచనా సామర్థ్యాలు కూడా అభివృద్ధి చెందుతాయని వివరించారు. చర్చలు, వాదనలు, ప్రాజెక్ట్ వర్క్, రీడింగ్ మరియు రైటింగ్ కార్యకలాపాల ద్వారా విద్యార్థుల్లో విమర్శనాత్మక ఆలోచనను ఎలా పెంపొందించవచ్చో ఉపాధ్యాయులకు ప్రాయోగిక సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని పలు పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొని తమ అనుభవాలను పంచుకున్నారు. సెమినార్ విద్యార్థులను భవిష్యత్‌కు సిద్ధం చేసే విద్యావిధానాలపై కొత్త దృక్పథాన్ని అందించిందని ఉపాధ్యాయులు అభిప్రాయపడ్డారు.

# 2 వ సాధారణ మున్సిపల్ ఎన్నికల అభ్యర్థులకు ఎన్నికల వ్యయం సమావేశం




సత్తుపల్లి,ఆర్ సి,ఫిబ్రవరి04(తెలుగుగళం)న్యూస్:ఖమ్మంజిల్లా సత్తుపల్లి పట్టణంలోనీ పురపాలక సంఘం కార్యాలయ ఆవరణలో బుదవారం ఉదయం 02 వ సాధారణ మున్సిపల్ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అవగాహన సదస్సు జరిగింది.మున్సిపల్ కమీషనర్ నరసింహ అధ్యక్షత వహించారు.అభ్యర్థుల ఎన్నికల వ్యయ గరిష్ట పరిమితి లక్ష రూపాయలు మాత్రమేనని వెల్లడించారు. వాళ్లు దాన్ని సంబంధించిన ఏమి ప్రచారం చేసిన లక్ష పరిమితిలోనే ప్రచారం చేయాలన్నారు.సభలకి వాహనాలకు వినియోగానికి తప్పనిసరిగా మునిసిపల్ పర్మిషన్ తీసుకోవాలనీ నరసింహ స్పష్టం చేశారు.



తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు తమ ఎన్నికల ఖర్చుల వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలి. దీనికి సంబంధించిన ముఖ్యమైన నిబంధనలు ఇక్కడ ఉన్నాయి .ఖర్చుల రిజిస్టర్ నిర్వహణ నామినేషన్ వేసినప్పటి నుండి ఫలితాల ప్రకటన వరకు అభ్యర్థి చేసే ప్రతి ఖర్చును విడివిడిగా రిజిస్టర్లో నమోదు చేయాలి.ప్రత్యేక బ్యాంక్ ఖాతా నామినేషన్ వేయడానికి కనీసం ఒక రోజు ముందే అభ్యర్థి తన పేరుతో లేదా ఎన్నికల ఏజెంట్ పేరుతో ఒక ప్రత్యేక బ్యాంక్ ఖాతా తెరవాలి. ఎన్నికల ఖర్చులన్నీ ఈ ఖాతా నుంచే జరగాలి.ఖర్చుల పరిమితి మున్సిపల్ కార్పొరేషన్లు మరియు మున్సిపాలిటీలలో జనాభా ప్రాతిపదికన తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన గరిష్ట పరిమితికి లోబడే ఖర్చు చేయాలి.ఖర్చుల వివరాల దాఖలు ఎన్నికల ఫలితాలు వెలువడిన 45 రోజుల ఫార్మాట్లో సంబంధిత అధికారులకు సమర్పించాలి. నిబంధనల ఉల్లంఘన – అనర్హత నిర్ణీత సమయంలోగా ఖర్చుల వివరాలు సమర్పించకపోయినా లేదా నిర్ణీత పరిమితికి మించి ఖర్చు చేసినా, అభ్యర్థిని 3 ఏళ్ల పాటు ఎన్నికల్లో పోటీ చేయకుండా తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం అనర్హుడిగా ప్రకటించవచ్చు. ఖర్చుల రకాలు బహిరంగ సభలు, ప్రచార వాహనాలు, పోస్టర్లు, బ్యానర్లు, సోషల్ మీడియా ప్రకటనలు మరియు టీ/ కాఫీ వంటి చిన్నపాటి ఖర్చులను కూడా రిజిస్టర్లో చూపాలి.మరింత సమాచారం మరియు ఫార్మాట్ల కోసం తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారిక వెబ్సైట్ను సంప్రదించవచ్చు.అభ్యర్థుల ఖర్చును వారి నామినేషన్ సమయంలో సమర్పించాలి ,వారి బ్యాంకు ఖాతాల నుంచే నిర్వహించాలి. వారికి బుక్ లేట్ లను 3 సార్లు తీసుకురావాలి , 5 6 7 తారీకు న అభ్యర్థి లేదా ఆథ్రైజ్డ్ వ్యక్తి తప్పని సరిగా హాజరు పరచాలి. అభ్యర్థులు అడిగిన ప్రతి ప్రశ్నలకు సమాధానం చెప్పడం జరిగింది.ఈ కార్యక్రమంలో మున్సిపల్ టి ఒ టి ఎస్ లు , అకౌంట్ టీమ్ తదితరులు పాల్గొన్నారు.

# ఒక్క అవకాశం ఇవ్వండి

### నూకల సరిత రంగారావును అక్కున చేర్చుకున్న హమాలీ కాలనీ

### నూకల సరిత రంగారావు ప్రచారానికి ప్రజల నుంచి మద్దతు

### ప్రతి ఇంటి సమస్య వింటూ.. పరిష్కారానికి భరోసా..

### మీ ఇంటి బిడ్డగా ఆదరించాలని విజ్ఞప్తి..

### 5వ డివిజన్ ప్రజల వాసులకు స్పష్టమైన హామీ..



కొత్తగూడెం, ఫిబ్రవరి4(తెలుగుగళం): కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ, ఐదవ డివిజన్ రాజకీయ వాతావరణం వేగంగా మారుతోంది. ఈ మార్పుకు కేంద్ర బిందువుగా నూకల సరిత రంగారావు నిలుస్తున్నారు. ఐదవ డివిజన్ అభ్యర్థిగా బరిలో ఉన్న ఆమె, దుంపలపూడి సురేష్ బాబు, డివిజన్ ముఖ్య నాయకుల సారధ్యంలో హమాలీ కాలనీలో చేపట్టిన ముమ్మర ఎన్నికల ప్రచారం ప్రజల్లో కొత్త ఆశలు రగిలించింది. ఇంటింటి ప్రచారంలో భాగంగా కాలనీ ప్రజల గడపలు తట్టిన నూకల సరిత రంగారావు, ఏళ్లుగా పరిష్కారం కాని సమస్యలను స్వయంగా విని స్పందించారు. హమాలీ కాలనీ ఎదుర్కొంటున్న డ్రైనేజీ సమస్యలు, వీధి దీపాల లేమి, మౌలిక వసతుల కొరతపై ఆమె స్పష్టంగా స్పందిస్తూ... తాను గెలుపొందితే ఈ సమస్యలన్నిటికీ శాశ్వత పరిష్కారం చూపుతానని హామీ ఇచ్చారు. కాలనీలోని సర్వే నెంబరు 817లో కొనసాగుతున్న భూ సంబంధిత సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామని, అధికారులతో సమన్వయం చేసుకుని న్యాయం జరిగేలా చూస్తానని నూకల సరిత రంగారావు స్పష్టం చేశారు. అలాగే జిసిసి నుండి హమాలీ కాలనీ వరకు రోడ్డు వెడల్పు చేసి, వీధి దీపాల ఏర్పాటు చేయడంతో పాటు కాలనీ రూపురేఖలు మారేలా అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు.

అంతేకాదు, కాంట్రాక్టర్స్ కాలనీకి సంబంధించిన సమస్యల పరిష్కారానికి కూడా ప్రత్యేకంగా కృషి చేస్తానని మాట ఇచ్చారు. ప్రజల సమస్యలు ఎన్నికల సమయంలో మాత్రమే కాదు... ఏడాది పొడవునా తన బాధ్యతగా భావించి పనిచేస్తానని ఆమె స్పష్టంగా చెప్పారు.


హమాలీ కాలనీ ప్రజలు అభ్యర్థికి ఘన స్వాగతం పలకడం ఈ ప్రచారానికి ప్రధాన ఆకర్షణగా నిలిచింది. మహిళలు, యువత, కార్మికులు పెద్ద సంఖ్యలో ముందుకు వచ్చి ప్రచారంలో పాల్గొనడం చూస్తే ఐదవ డివిజన్‌లో మార్పు కోరుకుంటున్న గట్టి సంకల్పం స్పష్టంగా కనిపించింది. "మా కాలనీ సమస్యలు తెలిసిన నాయకురాలే మాకు కావాలి" అన్న ప్రజల స్వరం కాలనీ అంతటా ప్రతిధ్వనించింది.

ప్రచార కార్యక్రమంలో దుంపలపూడి సురేష్ బాబు మాట్లాడుతూ, నూకల సరిత రంగారావు ప్రజల మధ్య నుంచే ఎదిగిన నాయకురాలని, హమాలీ కాలనీతో పాటు ఐదవ డివిజన్ మొత్తం అభివృద్ధికి ఆమె బలమైన స్వరంగా నిలుస్తారని అన్నారు. ప్రజల ఆశీర్వాదంతో ఈ ఎన్నికల్లో విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో పాల్వంచ పట్టణ అధ్యక్షులు నూకల రంగారావు,పట్టణ కాంగ్రెస్ నాయకులు గంగాధర్, లోగాని మురళి, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొని ప్రచారాన్ని విజయవంతం చేశారు. ప్రజల స్పందన చూస్తే ఐదవ డివిజన్‌లో ఈసారి రాజకీయ సమీకరణలు పూర్తిగా మారుతున్నాయన్న అభిప్రాయం బలంగా వ్యక్తమవుతోంది. హమాలీ కాలనీ నుంచి మొదలైన ఈ మార్పు నినాదం... త్వరలోనే డివిజన్ అంతటా గట్టిగా మోగుతుందన్న అంచనాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.







# ఇంటింటి ప్రచారంలో రెడ్యా నాయక్



తెలుగు గళం న్యూస్ మహబూబాబాద్ జిల్లా: డోర్నకల్ నియోజకవర్గం,మరిపెడ మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డులలో ప్రముఖ వ్యక్తులను, వివిధ రంగాలకు చెందిన వ్యాపారస్తులను కలిసి ఓటు అభ్యర్థిస్తున్న డోర్నకల్ మాజీ శాసనసభ్యులు రెడ్యా నాయక్,మహబూబాబాద్ జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గుడిపూడి నవీన్ రావు,మున్సిపల్ ఎన్నికల ఇంచార్జ్ ఏనుగుల రాకేష్ రెడ్డి,ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ మరిపెడ పట్టణంలో మీ అనుభవం మీ ఆలోచన విధానాలు మున్సిపాలిటీ ప్రజలకు ఎంతో అవసరమని మున్సిపాలిటీలోని సీనియర్ నాయకులని ప్రముఖ వ్యాపారస్తులని,మాజీ సర్పంచులని వివిధ సంఘాల నాయకులని కలిసి మున్సిపాలిటీలోని నిలబడిన అభ్యర్థులకు మీ సహాయ సహకారాలు కావాలని బీఆర్ఎస్ పార్టీ తరపున మిమ్మల్ని అందరిని అభ్యర్థిస్తున్నారని మీరంతా మా పాత మిత్రులైన అని తెలిపారు ఈసారి మున్సిపాలిటీలో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపిస్తారని మనసారా కోరుకుంటున్నాను అన్నారు,వారి వెంట మరిపెడ మున్సిపాలిటీ పట్టణ అధ్యక్షులు ఉప్పుల నాగేశ్వరరావు,మాజీ సర్పంచ్ రాంపెల్లి అబ్బయ్య గౌడ్,మల్లు ఉపేందర్ రెడ్డి, మార్కొండ్య, రమేష్,వార్డు కౌన్సిలర్ అభ్యర్థులు,నాయకులు తదితరులు పాల్గొన్నారు.




# ఫిబ్రవరి 12 దేశవ్యాప్తంగా జరుగు సార్వత్రిక సమ్మెలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలి-టియుసిఐ జిల్లా కోశాధికారి శరత్




సత్తుపల్లి,ఆర్ సి,ఫిబ్రవరి04(తెలుగుగళం)న్యూస్: కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను ప్రభుత్వం ఒక కలం పోటుతో వాటిని రద్దు చేస్తున్నారని కార్మిక సంక్షేమాలు ప్రయోజనాలను పరిణులకు తీసుకొని రూపొందించబడ్డ హక్కులను ఒక్కొక్కటి తొలగిస్తున్నారని అందులో భాగమే 29 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్ గా మార్చారు ఇది కార్మికులకు నష్టకరమైన చర్యని టియుసిఐ ఖమ్మం జిల్లా కోశాధికారి అమర్లపూడి శరత్ అన్నారు.బుదవారం సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలోని పెనుబల్లి ప్రభుత్వ హాస్పిటల్ లో సమ్మె పోస్టర్స్ ఆవిష్కరణ చేయటం జరిగింది అనంతరం వారు మాట్లాడుతూ బ్రిటిష్ కాలంలో వచ్చిన కార్మిక చట్టాలను నూతీవీకరణ చేస్తున్నారని కార్మికులకు లాభం కలిగే విధంగా సవరిస్తున్నామని చెప్పి నాలుగు లేబర్ కోడ్ లను తీసుకొచ్చరానీ భవిష్యత్తులో కాంట్రాక్టర్లు కార్మికులకు అన్యాయం చేస్తున్న అడగటానికి అవకాశం లేకుండా చేస్తున్నాయని వారు అన్నారు . ప్రభుత్వ హాస్పిటల్ పనిచేస్తున్న . కాంట్రాక్ట్ కార్మికులకు ప్రభుత్వం జీవో ప్రకారం వారికి వేతనాలు అందటం లేదని అరకొరగా ఇస్తున్నారని వారు అన్నారు. .సోషల్ సెక్యూరిటీ పేరు మీద సామాజిక బాధ్యత కల్పిస్తామంటున్న పాలకులు కనీసం ప్రైవేట్ ఫండ్ అమలు నుండి తప్పుకోవడానికి అవకాశాన్ని కల్పించడం, 12 శాతం పిఎఫ్ ను 10% కూడా తగ్గించుకోవచ్చని అవకాశం కల్పించడం ఈఎస్ఐ కార్మికుల భీమా చట్టం ఈ చట్టం కార్మికులకు దీమనిస్తూన్నాది కాని నేడు తీసుకొచ్చిన సామాజిక భద్రత చట్టం కార్మికులకు ధీమాను కార్మికుల రక్షణ గాల్లో దీపంగా మార్చేసిందని ఈ తరుణంలో కార్మిక వర్గం మొత్తం కూడా తమ సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ఉండి ఫిబ్రవరి 12న జరిగే సార్వత్రిక సమ్మెలో గ్రామపంచాయతీ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని తమ నిరసన వ్యక్తం చేయాలని వారు పిలుపు నివ్వటం జరిగింది.ఈ కార్యక్రమం లో పాపారావు, రవి, కళ్యాణ్, మరేశ్వరరావు, రావణ, రాంలి, సరోజినీ, నాగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# అమూల్యమైన ఓటు వేసి గెలిపించండి

## 13 వ వార్డ్ కౌన్సిలర్ అభ్యర్థి రేఖ శైలజ అశోక్ యాదవ్




తెలుగు గళం న్యూస్ మహబూబాబాద్ జిల్లా: మరిపెడ మున్సిపాలిటీలోని 13వ వార్డు బిజెపి అభ్యర్థి రేఖ శైలజ అశోక్ యాదవ్ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మరిపెడ గ్రామంలోని 13 వ వార్డులో గడప గడప తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో బిజెపి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని అందరూ గమనించి చేసిన అభివృద్ధి పనులను,సంక్షేమ పథకాలను వార్డు సభ్యులకు వివరించారు.తమను కౌన్సిలర్ గా గెలిపిస్తే మీ అందరి సహకారంతో వార్డును అన్ని విధాల అభివృద్ధి చేస్తామని తెలిపారు. బీజేపీ కమలం గుర్తుకు ఓటు వేసి తమను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.ఈ ప్రచారంలో కార్యక్రమానికి శ్రీనివాస్, సంతోష్,బిజెపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# బొగ్గు రవాణాతో వరంగల్‌లో పర్యావరణ, ప్రజారోగ్య సమస్యలు


### - లోక్‌సభలో కేంద్రాన్ని ప్రశ్నించిన ఎంపీ డా. కడియం కావ్య



తెలుగు గళం న్యూస్ న్యూ ఢిల్లీ: వరంగల్ జిల్లాలో బొగ్గు రవాణా కారణంగా ఏర్పడుతున్న పర్యావరణ, ప్రజారోగ్య సమస్యలపై లోక్‌సభలో వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.బొగ్గు రవాణా, అనుబంధ లాజిస్టిక్స్ వల్ల రహదారి, రైలుమార్గాల్లో కాలుష్యం పెరుగుతోందా? వరంగల్ జిల్లాపై దాని ప్రభావంపై అధ్యయనం చేశారా? దుమ్ము కాలుష్యం తగ్గించేందుకు, ప్రజల భద్రత కోసం ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో వివరాలు ఇవ్వాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డిని కోరారు.

ఈ ప్రశ్నకు మంత్రి జి. కిషన్ రెడ్డి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.వరంగల్‌కు సమీపంలోని బొగ్గు గనులు జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని భూపాలపల్లి ప్రాంతంలో సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఉన్నాయని తెలిపారు. ప్రతిరోజూ సుమారు 4 వేల టన్నుల బొగ్గును భూపాలపల్లి గనుల నుంచి ఉప్పల్ రైల్వే సైడింగ్‌కు టార్పాలిన్ కవర్లు వేసిన లారీల ద్వారా సుమారు 56 కిలోమీటర్ల మేర రవాణా చేస్తున్నట్లు వెల్లడించారు.బొగ్గు రవాణా ప్రభావాలపై EPTRI ద్వారా గాలి నాణ్యత, శబ్ద కాలుష్యం, నీటి నాణ్యత, సామాజిక అంశాలపై అధ్యయనాలు నిర్వహించామని, ట్రాఫిక్ ప్రభావ అంచనా నివేదికలు సిద్ధం చేశామని మంత్రి పేర్కొన్నారు. కేంద్ర పర్యావరణ శాఖ, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటిస్తూ, ప్రతి ఆరు నెలలకు ఒకసారి పర్యావరణ అనుసరణ నివేదికలు సమర్పిస్తున్నామని స్పష్టం చేశారు. డ్రైవర్లకు బ్రెత్ అనలైజర్ పరీక్షలు నిర్వహిస్తూ రోడ్డు భద్రతపై దృష్టి సారిస్తున్నామని తెలిపారు. బొగ్గు రవాణా వల్ల వరంగల్ ప్రాంత ప్రజల ఆరోగ్యం, పర్యావరణంపై ప్రతికూల ప్రభావాలు లేకుండా చర్యలు కొనసాగుతున్నాయని కేంద్రం తెలిపింది.ఈ సందర్భంగా ఎంపీ డా. కడియం కావ్య స్పందిస్తూ, కేంద్రం పేర్కొన్న చర్యలు క్షేత్రస్థాయిలో సరిపోతున్నాయా? అని ప్రశ్నించారు. గ్రామాల గుండా వెళ్లే బొగ్గు లారీల వల్ల దుమ్ము మబ్బుల్లా ఎగసిపడుతోందని, చిన్నపిల్లలు, వృద్ధులు శ్వాస సంబంధిత సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. కేవలం కాగితాలపైనే కాకుండా వాస్తవంగా దుమ్ము కాలుష్యాన్ని నియంత్రించే చర్యలు అమలు చేయాలని కేంద్రాన్ని కోరారు.

# పవన్‌పై టీపీసీసీ చీఫ్ హాట్ కామెంట్స్.. స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చిన జనసేన




ఏపీ న్యూస్, 04 ఫిబ్రవరి (తెలుగు గళం న్యూస్): ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌పై టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ చేసిన వ్యాఖ్యలు రెండు రాష్ట్రాల మధ్య పొలిటికల్ హీట్‌ను పుట్టిస్తున్నాయి. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ తరఫున పవన్ ప్రచారం చేయబోతున్నారని ప్రకటన వెలువడిన నేపథ్యంలో మహేశ్ కుమార్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తాజాగా, ఆ వ్యాఖ్యలకు తెలంగాణ జనసేన పార్టీ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ (ట్విట్టర్) వేదికగా స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చింది. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు తెలంగాణ పార్టీలు కాదు జాతీయ పార్టీలని అన్నారు. అలాగే జనసేన కేవలం ఆంధ్ర కోసం పెట్టిన పార్టీ కాదని. జాతీయ సమగ్రత కోసం తెలంగాణ గడ్డ మీద పెట్టిన పార్టీ అని తెలిపారు. ప్రాంతీయ విభేదాలు సృష్టించాలని చూస్తే ఊరుకోం అంటూ జనసేన తెలంగాణ పెట్టిన పోస్ట్ తాజాగా వైరల్ అవుతోంది.

మహేశ్ కుమార్ గౌడ్ ఏమన్నారంటే..

పవన్ ఆంధ్రాలో రాజకీయం చేసుకోవాలని.. తెలంగాణ లో కాదని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ కామెంట్ చేశారు. గతంలో తెలంగాణ రాష్ట్రం గురించి, తెలంగాణ వ్యక్తుల గురించి, భాష, సంస్కృతి గురించి దారుణంగా మాట్లాడారని మండిపడ్డారు. అందుకే పవన్‌ను తాము దిష్టి కల్యాణ్ అని అంటామని సెటైర్లు వేశారు. దారణంగా ఓడిపోతామనే భయంతో పవన్ కల్యాణ్ లాంటి సినీ తారలను బీజేపీ నాయకులు అడుక్కునే పరిస్థితి వచ్చిందని మహేశ్ కుమార్ గౌడ్ ధ్వజమెత్తారు.

# పవన్ కళ్యాణ్ కూడా అసత్య ప్రచారం చేశారు.. ఫ్లెక్సీలు మాక్కూడా కట్టొచ్చు!



ఏపీ న్యూస్, 04 ఫిబ్రవరి (తెలుగు గళం న్యూస్): సీఎం చంద్రబాబు ఏడాదిన్నరగా కావాలనే ప్రజలను మభ్యపెట్టే కార్యక్రమం చేపట్టారని సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మండిపడ్డారు. తిరుమల లడ్డు నెయ్యిలో జంతువుల కొవ్వు ఉందని రకరకాలుగా ప్రచారం చేశారని, చివరికి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కూడా అసత్య ప్రచారం చేశారని అసహనం వ్యక్తం చేశారు. దేవుడంటే ఏమాత్రం భయం, భక్తి లేకుండా రాజకీయాలు చేశారని ఫైర్ అయ్యారు. అంబటి రాంబాబు, జోగి రమేష్, విడదల రజని మీద దాడులు చేశారని.. వారు చేసిన తప్పేంటి? అని ప్రశ్నించారు. ఇదే ప్రభుత్వం ఎప్పుడూ ఉండదని, వచ్చే మూడేళ్లలో తమ ప్రభుత్వం వస్తుందని వైఎస్ జగన్ అన్నారు. టీడీపీ నేతల దాడిలో ధ్వంసమైన మాజీ మంత్రి అంబటి రాంబాబు ఇంటికి వెళ్లి.. ఆయన కుటుంబ సభ్యులను జగన్ పరామర్శించారు.

వైఎస్ జగన్ మీడియాతో మాట్లాడుతూ... 'రాష్ట్రంలో జంగిల్ రాజ్యం నడుస్తుంది. భయానక వాతావరణంలో పాలన జరుగుతుంది. అంబటి, జోగి రమేష్ ఇళ్లపై దాడులు చూస్తే జంజిల్ రాజ్యం ఏ స్థాయిలో ఉందో తెలుస్తుంది. అంబటి, జోగి, కాకాణిలు చేసిన తప్పేంటి?. ప్రశ్నిస్తున్నారని మా వాళ్ళపై దాడులు చేస్తున్నారు. సీఎం చంద్రబాబు కుట్ర పూరితంగా జంతువుల కొవ్వు అని తప్పుడు ప్రచారం చేసాడు. ఆవు, పంది, చేప కొవ్వు అంటూ ఉద్దేశ్య పూర్వకాలంగా దేవుడి ప్రతిష్టను దిగజార్చే ప్రయత్నం చేసారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ గారికి దేవుడంటే భయం భక్తి లేవు. దుర్మార్గంగా తప్పుడు ప్రచారం చేశారు. కేంద్ర ల్యాబ్లు ఎలాంటి జంతువుల కొవ్వు లేదని రిపోర్ట్ ఇచ్చాయి. సీబీఐ అదే విషయాన్ని సుప్రీం కోర్టుకి రిపోర్ట్ ఇచ్చింది. తప్పు చేసి ఉంటే వైవీ సుబ్బారెడ్డి, కరుణాకర్ రెడ్డి పేర్లు సీబీఐ ఎందుకు చేర్చలేదు. సీబీఐ వాళ్లకు క్లీన్ చిట్ ఇచ్చింది. అసలు సీబీఐ విచారణ కావాలని సుప్రీమ్ కోర్టును కోరిందే వైవీ సుబ్బారెడ్డి. చంద్రబాబు, లోకేష్, పవన్లు చెంపలేసుకుని క్షమాపణ కోరాలి. క్షమాపణ చెప్పకుండా మళ్లీ అదే దుర్మార్గపు అపార్ధాలను ప్రచారం చేస్తున్నారు' అని ఫైర్ అయ్యారు.

'సిగ్గు లేకుండా ఫ్లెక్సీలు వేయిస్తున్నారు. కుల మతాలను రెచ్చగొట్టే ఫ్లెక్సీలు పెట్టడం రాజ్యాంగ విరుద్ధం కాదా. ఇలానే మేము సూపర్ సిక్స్ అమలు చెయ్యలేదని ఫ్లెక్సీలు వేస్తే ఒప్పుకుంటారా. ఫ్లెక్సీలు పెట్టి ప్రజల్లో బావోగ్వేదాలు రెచ్చగొట్టేలా చెయ్యడం తప్పు కాదా?. ఇలాంటి దుర్మార్గాలను ప్రశ్నిస్తే మా వాళ్ళపై దాడులు చేయిస్తారా?. సీఎం చంద్రబాబుకి మంచి బుద్ధి ప్రసాదించాలని దేవుణ్ణి కోరి గుడి నుండి వస్తుంటే దాడులు చేసారు. అంబటి రాంబాబుని పోలీసుల సమక్షంలో కర్రలు పట్టుకుని కారుపై దాడికి పాల్పడ్డారు. కారులో ఉన్న రాంబాబుని దారుణమైన భూతులు తిడుతూ దాడి చేసారు. ఒక్కడే ఉండటం వల్ల అంబటి ఆగ్రహానికి గురయ్యారు. అలాంటి సమయంలో నోట్లో నుండి రెండు తిట్లు వచ్చాయి. ప్రాణం మీదకి వచ్చినప్పుడు వచ్చిన తిట్లే తప్ప ఉద్దేశ్య పూర్వకంగా తిట్టలేదు. సంస్కారం ఉన్న వ్యక్తి కనుక ఆ మాటలు రావడంపై బాధపడి.. వివరణ ఇచ్చాడు. తిట్లు వచ్చినందుకు చింతిస్తూ వెనక్కి తీసుకున్నాడు. అలాంటి సంస్కారం ఉన్న అంబటిని చేతనైతే పొగడాలి.. కానీ దుర్మార్గంగా హత్య చెయ్యడానికి ప్రయత్నించారు. ఏకంగా 8 గంటల పాటు హత్యకు ప్రయత్నించారు. ఎమ్మెల్యే గల్లా మాధవి ఆధ్వర్యంలో పోలీసుల సమక్షంలో దాడి చేశారు. ఇంట్లో మహిళలను ఇష్టం వచ్చినట్లు తిడుతూ ఫర్నీచర్ పగలగొట్టారు. కార్లు ధ్వంసం చేసి.. ఆఫీస్ కి నిప్పు పెట్టారు. పోలీసులు బాధ్యతగా వ్యవహరించి ఉంటే ఇలాంటి దాడులు జరిగేవా?. డీజీపీ ఆఫీస్ కూతవేటు దూరంలో ఉంది.. పక్కనే బెటాలియన్ ఉంది.. కంట్రోల్ చెయ్యలేరా?. అధికారులకు ఫోన్లు చేసినా ఒక్కరు ఎత్తలేదు.. పక్కా ప్లాన్ ప్రకారం హత్యాయత్నం చేసారు' అని వైఎస్ జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ఆధారాలు దోరికాయి.. మంచు మోహన్ బాబు, విష్ణు లకు నోటీసులు ఇస్తాం!



ఏపీ న్యూస్, 04 ఫిబ్రవరి (తెలుగు గళం న్యూస్): తిరుపతిలో విద్యార్థి సంఘం నేతల కిడ్నాప్ ఘటన తీవ్ర సంచలనంగా మారిన విషయం తెలిసిందే. మోహన్ బాబు యూనివర్సిటీ లో జరుగుతున్న ఫీజుల దోపిడీకి వ్యతిరేకంగా నిరసన చేపట్టేందుకు వెళ్లిన విద్యార్థి సంఘం నేతలను కిడ్నాప్ చేసిన కేసులో కీలక ఆధారాలు లభించాయని తిరుపతి పోలీసులు వెల్లడించారు. ఈ కేసులో భాగంగా మోహన్ బాబు యూనివర్సిటీ యాజమాన్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

ఈ ఘటనపై తిరుపతి అడిషనల్ ఎస్పీ రవిమనోహరచారి మాట్లాడుతూ.. రెండు రోజుల క్రితం మోహన్ బాబు కాలేజీలో ఫీజుల వసూళ్లపై నిరసన చేపట్టేందుకు వెళ్లిన విద్యార్థి సంఘం నేతలు వినోద్, అక్బర్‌లను కిడ్నాప్ చేసినట్లు తెలిపారు. బాధితుల ఫిర్యాదు అందగానే పోలీసులు తక్షణమే స్పందించి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టారని చెప్పారు. శేషాపురం ప్రాంతంలో కిడ్నాప్‌కు పాల్పడిన 13 మందిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

ఈ నేరానికి ఉపయోగించిన మూడు ఇనోవా వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు. ఆ మూడు వాహనాలు మోహన్ బాబు యూనివర్సిటీకి చెందినవేనని పోలీసులు స్పష్టం చేశారు. అరెస్ట్ అయిన వారిలో మోహన్ బాబు యూనివర్సిటీ పీఆర్వో సతీష్‌తో పాటు బౌన్సర్లు, కొంతమంది విద్యార్థులు కూడా ఉన్నట్లు తెలిపారు. బౌన్సర్లను కేవలం స్వీయ రక్షణ కోసం మాత్రమే ఉపయోగించుకోవాలని, ఇలాంటి నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని అడిషనల్ ఎస్పీ హెచ్చరించారు.

ఈ కేసులో ఏ2, ఏ3గా మోహన్ బాబు, విష్ణుల పేర్లు నమోదు చేసి వారికి నోటీసులు జారీ చేసి, విచారణ చేస్తామని రవిమనోహరచారి స్పష్టం చేశారు. ఇప్పటికే కొన్ని కీలక ఆధారాలు లభించాయని, తప్పు చేసినవారు ఎవరైనా సరే వదిలిపెట్టే ప్రసక్తి లేదని పోలీసులు తేల్చిచెప్పారు.

# సర్కార్‌కు హైకోర్టులో ఎదురు దెబ్బ.. నోటీసులు జారీ చేసిన న్యాయస్థానం




ఏపీ న్యూస్, 04 ఫిబ్రవరి (తెలుగు గళం న్యూస్): ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి ప్రభుత్వానికి హైకోర్టులో ఊహించని ఎదురు దెబ్బ తగిలింది. విశాఖపట్నం సమీపంలోని అడవి వరం, ముడసరిలోవ ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్న అదానీ డేటా సెంటర్‌కు సంబంధించిన భూ కేటాయింపుల వ్యవహారంపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వానికి, సంబంధిత కంపెనీలకు నోటీసులు జారీ చేసింది. విశాఖపట్నం జిల్లాలో సుమారు 480 ఎకరాల ప్రభుత్వ భూమిని, సుమారు రూ.5,000 కోట్ల విలువైన భూమిని, అదానీ గ్రూప్‌కు చెందిన రైడ్ అండ్ ఇన్ఫోటెక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, అదానీ ఇన్ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్, అదానీ పవర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలకు ఉచితంగా కేటాయించడాన్ని సవాలు చేస్తూ అనకాపల్లి జిల్లాకు చెందిన జై భీమ్ భారత్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నేతల నాగేశ్వరరావు హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు.

ఈ పిల్‌పై విచారణ చేపట్టిన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీర సింగ్ ఠాకూర్, జస్టిస్ చల్లా గుణరంజన్ల ధర్మాసనం, రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాలపై పలు కీలక ప్రశ్నలు సంధించింది. రాష్ట్ర ప్రభుత్వం జీవో ఎంఎస్ నెంబర్ 40 (తేదీ 11-10-2025) ద్వారా భూమితో పాటు రూ.1000 కోట్ల ప్రోత్సాహకాలు ఇవ్వాలని నిర్ణయించిందని, అనంతరం జీవో ఎంఎస్ నెంబర్ 66 (తేదీ 02-12-2025) ద్వారా 480 ఎకరాల భూమిని తక్షణమే బదలాయించాలని ఉత్తర్వులు జారీ చేసినట్లు పిటిషనర్ హైకోర్టు దృష్టికి తీసుకువచ్చారు. పిటిషనర్ తరఫున వాదనలు వినిపించిన ప్రముఖ న్యాయవాది జడ శ్రవణ్ కుమార్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ల్యాండ్ అలాట్మెంట్ పాలసీ ప్రకారం కంపెనీలకు భూమిని ఉచితంగా బదలాయించే అధికారం ప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు. జీవో ఎంఎస్ నెంబర్ 117 (తేదీ 09-11-2023) ప్రకారం భూమిని కేవలం లీజు పద్ధతిలో మాత్రమే ఇవ్వాలన్న నిబంధన ఉందని తెలిపారు.

ఇక, పరిశ్రమ పూర్తయ్యాకే భూ బదలాయింపు జరగాలన్న నిబంధన ఉన్నప్పటికీ, ముందుగానే సేల్ డీడ్ రాయిస్తే రాష్ట్ర ప్రభుత్వం భూమిపై తన పూర్తి హక్కులను కోల్పోతుందని న్యాయవాది హెచ్చరించారు. ఒకసారి సేల్ డీడ్ రాసి ఇస్తే, ప్రాజెక్టు పూర్తికాకపోయినా భూమిని తిరిగి స్వాధీనం చేసుకునే హక్కు ప్రభుత్వానికి ఉండదని వాదించారు. ఈ నేపథ్యంలో, ఏ పాలసీ ఆధారంగా భూమిని ఉచితంగా బదలాయిస్తున్నారు?, ఈ జీవోల ప్రకారం ఇప్పటికే సేల్ డీడ్‌లు రాశారా? అంటూ హైకోర్టు ప్రభుత్వాన్ని తీవ్రంగా ప్రశ్నించింది. ప్రభుత్వం తరఫున వాదనలు వినిపించిన అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, పూర్తి వివరాలు సమర్పించేందుకు సమయం కోరారు. దీనికి స్పందించిన హైకోర్టు, రాష్ట్ర ప్రభుత్వం పూర్తి వివరాలతో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశించింది. భూ బదలాయింపుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన చట్టాలు, నిబంధనలు పాటించాల్సిందేనని స్పష్టం చేసిన న్యాయస్థానం, ప్రతివాదులందరికీ నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. ఈ కేసు రాష్ట్రంలో భూ కేటాయింపులు, పరిశ్రమలకు ఇచ్చే ప్రోత్సాహకాలపై కీలక ప్రభావం చూపే అవకాశం ఉందని న్యాయవర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

## ఫిబ్రవరి 12న బంగ్లాలో ఎన్నికలు.. భారత్‌తో మ్యాచ్‌పై పాక్ యూ టర్న్.. ఆ రోజే తెలుస్తుంది!



స్పోర్ట్స్ న్యూస్, 04 ఫిబ్రవరి (తెలుగు గళం న్యూస్): భారత్ -పాకిస్తాన్ మధ్య క్రికెట్ సంబంధాలు ఇటీవలి కాలంలో తీవ్రంగా దిగజారాయి. ఈ నేపథ్యంలో పాక్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం క్రికెట్ ప్రపంచాన్ని ఆశ్చర్యానికి గురి చేసింది. ఫిబ్రవరి 15వ తేదీన కొలంబోలోని ఆర్. ప్రేమదాస స్టేడియంలో జరగాల్సిన గ్రూప్ దశ మ్యాచ్‌ను బహిష్కరించాలని పాక్ ప్రభుత్వం తమ జట్టుకు స్పష్టంగా ఆదేశాలు ఇచ్చింది.

అయితే, ఐసీసీ వరల్డ్ టీ20 2026లో పాల్గొనడానికి పాకిస్తాన్ క్రికెట్ జట్టుకు అనుమతి ఇస్తున్నాం.. కానీ, ఫిబ్రవరి 15న భారత్‌తో జరగాల్సిన మ్యాచ్‌లో తమ జట్టు మైదానంలోకి దిగటం లేదని చెప్పుకొచ్చింది. ఇక, ఈ నిర్ణయానికి గల కారణాన్ని దాయాది దేశం అధికారికంగా వెల్లడించలేదు. కానీ, భారత్‌కు రావడానికి నిరాకరించడంతో బంగ్లాదేశ్‌ను టోర్నమెంట్ నుంచి తొలగించి, వారి స్థానంలో స్కాట్లాండ్‌ను చేర్చడంపై పాకిస్తాన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ వ్యవహారంలో ఐసీసీ ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తోందని ఆరోపిస్తోంది.

యూ-టర్న్ తీసుకునే అవకాశం ఉందా?

ఇక, ఫిబ్రవరి 12వ తేదీన బంగ్లాదేశ్‌లో జరగనున్న సాధారణ ఎన్నికల అనంతరం పాకిస్తాన్ తన నిర్ణయాన్ని మార్చుకునే ఛాన్స్ ఉందనే వార్తలు వినిపిస్తున్నాయి. పాకిస్తాన్ క్రికెట్ బోర్డు ఛైర్మన్ మొహ్సిన్ నఖ్వీ (పీసీబీ) బంగ్లాదేశ్ ఎన్నికల ఫలితాల తర్వాత బహిష్కరణపై యూ-టర్న్ తీసుకోవచ్చనే అభిప్రాయం వ్యక్తం అవుతుంది. కాగా, నఖ్వీ ఒక క్రికెట్ నిర్వాహకుడి కన్నా రాజకీయ నాయకుడిగానే ఎక్కువగా పని చేస్తున్నారు.. ఫిబ్రవరి 12న ఎన్నికలు పూర్తయిన తర్వాత, ఫిబ్రవరి 15 మ్యాచ్‌కు మరో రెండు రోజులు సమయం ఉంటుంది.. ఆలోపు పరిస్థితులు పూర్తిగా మారవచ్చు.. లేదంటే, పాకిస్తాన్ అంతర్జాతీయంగా ఒంటరిగా మిగిలిపోయే ప్రమాదం ఉందని క్రికెట్ నిపుణులు పేర్కొంటున్నారు.

బ్రాడ్‌కాస్టర్లకు నష్టాలు.. కోర్టుకు వెళ్లే ఛాన్స్

భారత్- పాకిస్తాన్ మ్యాచ్ జరగకపోతే భారీ ఆర్థిక నష్టం వాటిల్లనుంది. ఈ నేపథ్యంలో అధికారిక బ్రాడ్‌కాస్టర్ జియోహాట్‌స్టార్ పాకిస్తాన్ క్రికెట్ బోర్డు, ఐసీసీపై న్యాయపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ఐసీసీ నాలుగేళ్ల పాటు ఒప్పందం కుదుర్చుకున్నప్పుడు, అందులో భారత్- పాకిస్తాన్ మ్యాచ్‌లు కీలక భాగంగా ఉన్నాయని క్రికెట్ వర్గాలు వెల్లడించాయి. ఆ మ్యాచ్‌ల ఆధారంగానే బ్రాడ్‌కాస్టర్ భారీ మొత్తంలో చెల్లింపులు చేశాడని తెలిపాయి. కాబట్టి మ్యాచ్ జరగకపోతే ఇది ఒప్పంద ఉల్లంఘనగా పరిగణించి కోర్టును ఆశ్రయించే హక్కు బ్రాడ్‌కాస్టర్‌కు ఉందని సమాచారం. ఇదిలా ఉండగా, ఈ విషయంలో మద్దతు కోసం పాకిస్తాన్ క్రికెట్ బోర్డు ఇతర సభ్య బోర్డులను సంప్రదించినప్పటికీ, ఎవరూ సపోర్టు ఇవ్వలేదు. ఈ పరిణామాలతో టీ20 వరల్డ్ కప్ 2026లో మ్యాచ్‌పై అనిశ్చితి నెలకొంది. అయితే, భారత్- పాకిస్తాన్ మ్యాచ్ జరుగుతుందా లేదా అనేది రాబోయే రోజుల్లో తేలనుంది.

## వరల్డ్‌కప్‌లో భారత్ ఆశలు అతడిపైనే.. అభిషేక్ పై రికీ పాంటింగ్ కీలక వ్యాఖ్యలు



స్పోర్ట్స్ న్యూస్, 04 ఫిబ్రవరి (తెలుగు గళం న్యూస్): టీ20 వరల్డ్‌కప్ 2026లో భారత ఓపెనర్ అభిషేక్ శర్మ బ్రేక్‌అవుట్ స్టార్‌గా మారతాడని ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ జోస్యం చెప్పారు. ఈ యువ బ్యాటర్ టోర్నమెంట్‌లో అత్యధిక పరుగులు సాధించే ఆటగాడిగా, అంతేకాదు ప్లేయర్ ఆఫ్ ద టోర్నమెంట్ అవార్డును కూడా గెలుచుకునే సత్తా అతడికి ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. 2018 ఐపీఎల్ సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ తరఫున అభిషేక్ కు తొలి కోచ్‌గా వ్యవహరించిన పాంటింగ్, అప్పుడే అతడిలో అసాధారణ ప్రతిభను గుర్తించానని చెప్పారు.

అభిషేక్ పై ప్రశంసలు: అయితే, అభిషేక్ శర్మ నా కోచింగ్‌లోనే ఐపీఎల్‌లో అరంగేట్రం చేశాడు.. అప్పటికి అతడి వయస్సు సుమారు 17 ఏళ్లు.. తొలి బంతినే నేరుగా బౌలర్ తలపైకి సిక్స్ లేదా ఫోర్‌గా కొట్టాడు అని రికీ పాంటింగ్ తెలిపారు. ఆ స్ట్రెయిట్ బ్యాట్ షాట్ చూస్తేనే ఇతడు ప్రత్యేకమైన ఆటగాడని అర్థమైందని తెలిపారు. అతడ్ని ఢిల్లీ క్యాపిటల్స్ నుంచి ట్రేడ్ చేయొద్దని తాను ఎంతగానో ప్రయత్నించానని గుర్తు చేసుకున్నారు. అతడు భవిష్యత్తులో సూపర్‌స్టార్ అవుతాడు అని జట్టు యాజమాన్యానికి చెప్పాను.. ఇప్పుడు అదే నిజమైందని పాంటింగ్ అన్నారు.

ఐపీఎల్‌లో సన్‌రైజర్స్‌కు కీలక ఆటగాడు: ఐపీఎల్ అరంగేట్రంలో ఢిల్లీ తరఫున 19 బంతుల్లో 46 పరుగులు చేసి అందరి దృష్టిని ఆకర్షించిన అభిషేక్, ఆ తర్వాత సన్‌రైజర్స్ హైదరాబాద్ కొనుగోలు చేసింది. 2019 నుంచి ఇప్పటి వరకు 71 ఇన్నింగ్స్‌ల్లో 1,753 పరుగులు, 162కి పైగా స్ట్రైక్ రేట్‌తో ఆడుతూ జట్టుకు ప్రధాన బ్యాటర్‌గా మారాడు.

అంతర్జాతీయ క్రికెట్‌లోనూ అదరగొట్టిన అభిషేక్: 2024 జూలైలో టీ20 అంతర్జాతీయ క్రికెట్ లోకి అరంగేట్రం చేసిన అభిషేక్ శర్మ, ఇప్పటి వరకు 37 ఇన్నింగ్స్‌ల్లో 1,297 పరుగులు సాధించాడు. అతడి సగటు 37.05 కాగా, స్ట్రైక్ రేట్ దాదాపు 195కి చేరుకుంది. ఇందులో రెండు సెంచరీలు, 8 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. న్యూజిలాండ్‌పై కేవలం 14 బంతుల్లో అర్ధశతకం చేయడం అతడి కెరీర్ లో హైలైట్ గా నిలిచింది.

వరల్డ్‌కప్‌లో అతడిపైనే భారత్ ఆశలు: టీ20 వరల్డ్‌కప్‌లో అభిషేక్ ప్రదర్శనే భారత్ భవితవ్యాన్ని నిర్ణయిస్తుందని రిక్కీ పాంటింగ్ అభిప్రాయపడ్డారు. అతడు రన్స్ చేస్తే భారత్‌ను ఓడించడం చాలా కష్టం అన్నారు. అతడు ఫెయిల్ అయితే భారత్ కూడా ఇతర జట్లలాగే బలహీనంగా మారుతుంది అని జోస్యం చెప్పారు. కాగా, డిఫెండింగ్ ఛాంపియన్ భారత్ ఫిబ్రవరి 7వ తేదీన ముంబైలో అమెరికాతో తమ వరల్డ్‌కప్ ప్రయాణాన్ని ప్రారంభించనుంది. ఈ టోర్నీలో అభిషేక్ శర్మ కీలక పాత్ర పోషిస్తాడని క్రికెట్ అభిమానులు ఆశిస్తున్నారు.

## వన్డే ప్రపంచకప్‌లో రోహిత్, కోహ్లీ ఆడతారా?.. ఎంఎస్ ధోనీ సంచలన వ్యాఖ్యలు



స్పోర్ట్స్ న్యూస్, 04 ఫిబ్రవరి (తెలుగు గళం న్యూస్): భారత క్రికెట్ అభిమానుల్లో ఎప్పటికీ ఆసక్తి రేపే ప్రశ్నల్లో ఒకటి – రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ 2027 వన్డే ప్రపంచకప్‌లో ఆడతారా? ఈ అంశంపై తాజాగా మాజీ టీమిండియా మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోని క్లారిటీ ఇచ్చారు. ఒక కార్యక్రమంలో పాల్గొన్న ఆయనకు ఈ ప్రశ్న ఎదురైంది.. మొదట ధోని సరదాగా విననట్టు నటించాడు.. కానీ, వెంటనే సీరియస్‌గా స్పందిస్తూ.. వయస్సు కంటే ఫిట్‌నెస్, ప్రదర్శనలే అసలైన ప్రమాణాలు అని తేల్చి చెప్పాడు.

వయస్సు కాదు.. ఫిట్‌నెస్, ఫామ్ ముఖ్యం: 2027 వరల్డ్ కప్ ఎందుకు ఆడకూడదు? వయస్సు ఎప్పుడూ ప్రమాణం కాదు.. ప్రదర్శన, ఫిట్‌నెస్ అసలు క్రైటీరియా అని మహేంద్ర సింగ్ ధోని అన్నారు. 22 ఏళ్లవాడైనా ఫిట్ లేకపోతే జట్టులో ఉండకూడదు.. అదే 35 ఏళ్లవాడు ఫిట్‌గా, బాగా ఆడితే అతన్ని ఆడించాల్సిన అవసరం ఉందన్నారు. తాను భారత జట్టులోకి వచ్చినప్పుడు తన వయస్సు గురించి ఎవరూ ప్రశ్నించలేదని గుర్తు చేశారు. ఇప్పుడు కూడా అదే విధంగా అందరినీ సమానంగా చూడాలని సూచించారు. “రోహిత్, విరాట్ లేదా భవిష్యత్తులో వచ్చే ఆటగాళ్లు- ఎవరికైనా ఒకే నియమాలు వర్తించాలి.. ఆడాలా వద్దా అన్నది వాళ్లే నిర్ణయించుకోవాలి.. దేశం కోసం ఆడాలనే ఆకాంక్ష ఉంటే, ప్రదర్శన కొనసాగితే ఎందుకు ఆపాలి? అని అడిగారు.

ప్రపంచకప్‌లో అనుభవం కీలకం: ప్రపంచకప్ లాంటి పెద్ద టోర్నమెంట్లలో అనుభవం ఎంత ముఖ్యమో కూడా ఎంఎస్ ధోని వివరించాడు. 20 ఏళ్ల వయస్సులోనే అనుభవం వస్తుందనుకోవడం తప్పు.. అంతర్జాతీయ క్రికెట్‌లో ఒత్తిడిని ఎదుర్కొన్నప్పుడే నిజమైన అనుభవం వస్తుంది అన్నారు. ముఖ్యంగా డెత్ ఓవర్లలో బౌలింగ్ చేసే వాళ్లు లేదా లోయర్ ఆర్డర్ బ్యాట్స్‌మెన్‌కు అనుభవం చాలా అవసరం అని తెలిపారు.

యువత ం అనుభవం = విన్నర్ టీం: జట్టు ఎంపికలో యువత ఉత్సాహం, సీనియర్ల అనుభవం రెండూ అవసరమని మిస్టర్ కూల్ ధోని అభిప్రాయపడ్డాడు. అయితే, 24 ఏళ్ల ఆటగాడికి ఎలాంటి ప్రమాణాలు ఉంటాయో, 35 ఏళ్ల ప్లేయర్ కీ కూడా అవే ఉండాలని సూచించారు. ప్రదర్శన ఉంటే ఆడతారు.. లేకపోతే ఎప్పుడైనా జట్టులో నుంచి తప్పిస్తారు అన్నారు. ఇక్కడ వ్యక్తిగతంగా ఎవరి గురించి ప్రశ్నే ఉండకూడదని తేల్చేశాడు. మొత్తానికి.. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ 2027 ప్రపంచకప్‌లో ఆడతారా? అన్న ప్రశ్నకు మహేంద్ర సింగ్ ధోని సమాధానం స్పష్టం చేయడంతో రాబోయే వరల్డ్ కప్ నాటికి వీరు ఇరువురు ఫామ్ లో ఉంటే తుది జట్టులో ఉండే అవకాశం మెరుగ్గా ఉంటుంది.

# సినిమా న్యూస్

## చిరంజీవి సినిమాలో ‘ధురంధర్’ హీరోయిన్



మన శంకర వర ప్రసాద్ సినిమాతో మెగాస్టార్ చిరంజీవి బ్లాక్ బస్టర్ అందుకున్న విషయం తెలిసిందే. ఈ సినిమా అనంతరం సమ్మర్‌లో అతడి విశ్వంభర చిత్రం కూడా ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. అయితే ఈ సినిమా తర్వాత బాబీతో మెగా 158 సినిమా చేయబోతున్నాడు చిరు. ఈ ప్రాజెక్ట్ గురించి ఒక ఆసక్తికరమైన వార్త ఫిలిం నగర్ వర్గాల్లో ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. ఈ చిత్రంలో చిరంజీవి కుమార్తెగా ఒక కీలక పాత్ర కోసం ‘పొన్నియిన్ సెల్వన్’ ఫేమ్, ధురంధర్ సినిమా సారా అర్జున్ పేరును దాదాపు ఖరారు చేసినట్లు సమాచారం. ఈ పాత్ర సినిమాలో అత్యంత కీలకం కానుందని తెలుస్తుంది. అయితే దీనిగురించి త్వరలోనే అధికారిక ప్రకటన రాబోతుంది. మరోవైపు చిరంజీవి కెరీర్‌లో ఇదొక ప్రత్యేకమైన మూవీగా నిలిచిపోతుందని మెగా అభిమానులు భారీ అంచనాలు పెట్టుకున్నారు. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన ప్రీ-ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతుండగా కన్నడ నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్ బ్యానర్ ఈ సినిమాను నిర్మిస్తుంది.



## 7 ఏళ్ల ఆశ.. మృణాల్ కోరిక తీర్చేదెవరు

మృణాల్ ఠాకూర్ లక్ తోక తొక్కిందా, ఫ్లాప్స్ ఉన్నా మేడమ్‌కు బాలీవుడ్ రెడ్ కార్పెట్ వేస్తుందా, బీటౌన్‌లో వరుస ఛాన్సులివ్వడం వెనుక టాలీవుడ్ కారణమా అంటే కచ్చితంగా యస్ చెప్పుకోవాల్సిందే సీతా మహాలక్ష్మీ. బుల్లితెర నుండి సిల్వర్ స్క్రీన్‌పైకి దూసుకొచ్చిన మృణాల్ కెరీర్ తొలి నాళ్లలో హృతిక్ సూపర్ 30, బాట్లా హౌస్ అంటూ హిట్స్ కొట్టింది, కరోనా ఎఫెక్ట్ వల్ల ఓటీటీలోకి పరిమితమైన ఈ భామ... జెర్సీతో థియేటర్ ప్రేక్షకులను పలకరిస్తే.. రిజల్ట్ ఫ్లాప్. అదే టైంలో టాలీవుడ్‌లో సీతామహాలక్ష్మీగా ఎంటరై... భారీ సక్సెస్ తెచ్చుకోవడంతో మేడమ్ క్రేజ్ అమాంతం పెరిగింది.

టాలీవుడ్ సీతామహాలక్ష్మీగా మారాక మళ్లీ బాలీవుడ్ బాట పట్టిన మృణాల్‌కు గుమ్రా, ఆంఖ్ మిచోలీ డిజాస్టర్లుగా మారాయి. గోస్ట్ స్టోరీస్, లస్ట్ స్టోరీస్ సిరీస్ చిత్రాలతో కాస్తో కూస్తో ఇమేజ్ నిలబడింది. తెలుగులో హాయ్ నాన్న హిట్టు మరోసారి ఆమె కెరీర్‌కు బూస్టర్ అయ్యింది. ఇలా ఆమె బీటౌన్ ముంగిట్లో ఫెయిలవుతున్న ప్రతిసారి టాలీవుడ్ ఆదుకుంది. ఇక గత ఏడాది వచ్చిన సన్నాఫ్ సర్దార్2 డిజాస్టర్. 7 ఏళ్ల నుండి బాలీవుడ్‌లో హిట్టే చూడని మృణాల్‌కు నార్త్ బెల్ట్ వరుస ఆఫర్లు ఇచ్చి.. రెడ్ కార్పెట్ వేయడం విడ్డూరమే అయినప్పటికీ.. సౌత్‌లో ఉన్న క్రేజే ఆమెకు ఛాన్సులు వచ్చేలా చేస్తున్నాయి. ప్రజెంట్ మృణాల్ దో దీవానే శెహర్ మే రొమాంటిక్ లవ్ స్టోరీతో బాలీవుడ్‌లో లక్ పరీక్షించుకోబోతుంది. ఈ నెల 20న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది ఫిల్మ్. అలాగే బైలింగ్వల్ మూవీ డెకాయిట్ నెక్స్ మంత్ రిలీజ్ కావాల్సి ఉండగా.. పోస్ట్ పోన్ అవుతుందన్న స్ట్రాంగ్ బజ్ నడుస్తోంది. ఇవే కాకుండా మేడమ్ చేతిలో హాయ్ జవాని తో ఇష్క్ హోనా హై, పూజా మేరీ జాన్ చేస్తోంది. మరీ ఈ సినిమాలతో ఏడేళ్ల తర్వాత మృణాల్ బీటౌన్‌లో హిట్ అందుకుందో లేదో ఈ మంత్ ఎండింగ్‌కు తేలిపోనుంది.

## 12 ఏళ్ల పోరాటం వదిలిపెట్టే ప్రసక్తి లేదు

‘RX -100’ చిత్రంతో తెలుగు కుర్రాళ్ల గుండెల్లో సెన్సేషన్ సృష్టించిన పాయల్ రాజ్‌పుత్ మొదటి ప్రాజెక్ట్‌తోనే ఫుల్ ఫేమ్ రాబట్టుకుంది. తన అందం, అభినయం, నటనతో ప్రేక్షకులను మంత్రముగ్దులను చేసింది. ఆ తర్వాత జిన్నా, వెంకీ మామ, రక్షణ వంటి చిత్రాల్లో నటించినప్పటికీ ఒక్క హిట్ కూడా పడలేదు. అయినప్పటికీ నిరాశ చెందకుండా పాయల్ వచ్చిన అవకాశాలు సద్వినియోగం చేసుకుంది. ఈ సమయంలో వచ్చిన మంగళవారం, తీస్ మార్ ఖాన్ బ్లాక్ బస్టర్ హిట్స్‌గా నిలవడంతో పాయల్ మళ్లీ ఫామ్‌లోకి వచ్చేసింది. ఇప్పుడు మరో ప్రయోగాత్మక చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. పాయల్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం ‘వెంకటలచ్చిమి’. ఒక ఆదివాసీ మహిళ తన జీవితంలో ఎదురైన అన్యాయంపై ఎలా ప్రతీకారం తీర్చుకుందనే ఇంటెన్స్ డ్రామాతో ఈ సినిమా తెరకెక్కుతోంది. ముని దర్శకత్వంలో వస్తున్న ఈ పవర్‌ఫుల్ థ్రిల్లర్‌ను ఆరు భాషల్లో భారీ ఎత్తున విడుదల చేసేందుకు నిర్మాతలు ప్లాన్ చేస్తున్నారు. ‘మంగళవారం’ వంటి హిట్ తర్వాత పాయల్ నుంచి వస్తున్న సినిమా కావడంతో దీనిపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇదిలా ఉంటే.. తాజాగా సోషల్ మీడియాలో చేసిన ఒక పోస్ట్ టాలీవుడ్‌లో కలకలం రేపుతోంది. తన కెరీర్ ముగిసిపోయిందని, నటన మానేయాలని విమర్శిస్తున్న వారికి ఆమె అత్యంత ఘాటుగా సమాధానమిచ్చింది. “నన్ను మానేయమని కొందరు కోరుకుంటున్నారు. నేను కూడా ఒక నిమిషం ఆలోచించాను. కానీ గత 12 ఏళ్లుగా నేను పడిన కష్టం గుర్తొచ్చింది. నేను విఫలం కావచ్చు, కానీ రంగాన్ని వదిలిపెట్టే ప్రసక్తి లేదు” అంటూ పాయల్ రాసుకొచ్చింది. అయితే తనను కించపరిచేలా మాట్లాడుతున్న వారి పేర్లను బయటపెట్టనప్పటికీ, తన పోరాటం కొనసాగుతుందని ఆమె స్పష్టం చేసింది. అలాగే తనను తక్కువ చేసి మాట్లాడుతున్న వారి నోళ్లు మూయించింది. ఇండస్ట్రీలో 12 ఏళ్లుగా కొనసాగుతూ ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొన్న పాయల్, ఇప్పుడు తన సెకండ్ ఇన్నింగ్స్‌ను చాలా సీరియస్‌గా తీసుకుంది. గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా, ‘వెంకటలచ్చిమి’ వంటి కథా బలం ఉన్న చిత్రాలను ఎంచుకుంటోంది. ప్రస్తుతం పాయల్ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా అది చూసిన నెటిజన్లు “వదిలిపెట్టకు పాయల్.. నీ టాలెంట్ ఏంటో నీ సినిమాలే చెబుతాయి” అంటూ నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు.



## మళ్ళీ మొదలవుతున్న ‘దూత’ వేట!




నాగచైతన్య ప్రస్తుతం కార్తీక్ దండు దర్శకత్వంలో వస్తున్న ‘వృషకర్మ’ షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. ఈ ఏడాదిలోనే ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. అయితే దీని తర్వాత చైతూ ఏ సినిమా చేస్తారనే దానిపై ఇప్పటి వరకు క్లారిటీ లేదు. ఈ నేపథ్యంలో, ఆయన నటించిన హిట్ వెబ్ సిరీస్ ‘దూత’కు సీక్వెల్ రాబోతుందన్న వార్త ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. చాలా కాలంగా అభిమానులు ‘దూత 2’ ఎప్పుడెప్పుడు వస్తుందా అని ఎదురుచూస్తున్నారు. సాగర్ పాత్రలో చైతన్యను మళ్ళీ ఆ సస్పెన్స్ మూడ్‌లో చూడాలని ఫ్యాన్స్ ఆశపడుతున్నారు. కాగా ‘దూత 2’ కోసం చైతన్య ఇప్పటికే గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం.

దర్శకుడు విక్రమ్ కె కుమార్ ఈ సీక్వెల్ కోసం అద్భుతమైన స్క్రిప్ట్‌ను సిద్ధం చేశారట. ‘దూత’ మొదటి భాగం అమెజాన్ ప్రైమ్‌లో ఎంతటి విజయాన్ని అందుకుందో మనకు తెలిసిందే. సస్పెన్స్ థ్రిల్లర్‌గా వచ్చిన ఆ సిరీస్‌లో చైతన్య నటనకు మంచి మార్కులు పడ్డాయి. ఇప్పుడు అంతకు మించిన థ్రిల్‌ను అందించడానికి విక్రమ్ కె కుమార్ ప్రీ-ప్రొడక్షన్ పనులను కూడా మొదలుపెట్టినట్లు తెలుస్తోంది. ఈ ప్రాజెక్ట్‌ను అన్నపూర్ణ స్టూడియోస్ నిర్మించబోతుండటం విశేషంత్వరలోనే దీనిపై అఫీషియల్ అనౌన్స్‌మెంట్ వచ్చే అవకాశం ఉంది. ఒకవేళ ఇది పట్టాలెక్కితే, టాలీవుడ్‌లో సక్సెస్ ఫుల్ వెబ్ సిరీస్ సీక్వెల్స్‌లో ‘దూత 2’ సరికొత్త రికార్డులు సృష్టించడం ఖాయమనిపిస్తోంది.

Printed and Published by Rayaparthi Bhanuprasad on be half Of Telugu galam
H.No: 1-6, Thammadapally-G, Guduru, PO: Thammadapalli 506316 , Jangoan , Telangana State,
Published at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS 3-63, Thanedharpalle, Ghanpur Station Mandal, Thanedharpalle 506143 Warangal ,Telangana State,
Rayaparthi Bhanuprasad TGTEL/25/A4366.